ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కడప
జిల్లా వార్తలు
శనివారం 24 ఆగస్టు 2024

టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజు తదితరులు





ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడు

● కలెక్టర్ శివశంకర్

కడప (కలెక్టరేట్/క్రైం), ఆగస్టు 23: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయుడని కలెక్టర్ లోతేటి శివశంకర్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక మీటింగ్ హాలులో ప్రకాశం పంతులు 153వ జయంతి సభ జరిగింది. జ్యోతి ప్రజ్వలన చేసి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రకాశం పంతులు రాజకీయ నాయకుడు, సంఘ సంస్కర్త అన్నారు. బ్రిటీష్ పాలనలోని మద్రాస్ ప్రెసిడెన్సీకి ముఖ్యమంత్రిగా కూడా ఉన్నారన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా ఎనలేని సేవలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డీఎఫ్‌వో సందీప్ రెడ్డి, డీఆర్వో గంగాధర్ గౌడ్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ధీరోదాత్తుడు ఆంధ్రకేసరి

ఆంధ్రరాష్ట్ర ప్రథమ ముఖ్యమంత్రి ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ధీరోదాత్తుడని ఎస్పీ హర్షర్ధన్‌రాజు కొనియాడారు. శుక్రవారం ప్రకాశం పంతులు జయంతిని జిల్లా పోలీసుకార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశంపంతులు చిత్రపటానికి ఎస్పీ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సైమన్ కమిషన్‌కు ఎదురునిలిచిన ధైర్యశాలి టంగుటూరి ప్రకాశం పంతులు అన్నారు. అప్పటి నుంచి ప్రజలంతా ఆయనను ఆంధ్రకేసరిగా కీర్తించారన్నారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంటు బ్యూరో ఏఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ ఏఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేష్, శ్రీశైలరెడ్డి పాల్గొన్నారు.

పటిష్టంగా ఇసుక పంపిణీ : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 23: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్న ఉచిత ఇసుక పంపిణీ ప్రక్రియను జిల్లాలో పటిష్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ లోతేటి శివశంకర్ పేర్కొన్నారు. శుక్రవారం రాజధాని అమరావతి నుంచి రాష్ట్ర మైన్స్ ప్రిన్సిపల్ సెక్రటరీ ముఖేశ్‌కుమార్ మీనా స్టాక్‌యార్డుల వద్ద ఇసుక లభ్యతపై అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హాజరయ్యారు. వీడియో కాన్ఫరెన్స్ ముగిసిన అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక విధానంలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా పారదర్శకంగా పంపిణీ జరగాలన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వాహనాల రద్దీ లేకుండా చూడాలన్నారు. ఇసుక లభ్యత, వినియోగంపై ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. ఇసుక సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నెంబరు 08562-246344ను ప్రజలకు తెలిసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇసుకపాలసీ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో, ప్రస్తుత ప్రభుత్వంలో ఇసుక పాలసీ అమలుపై ప్రజల స్పందన తెలుసుకోవాలని తహశీల్దార్లు, ఎంపీడీఓలను ఆదేశించారు.

ఇసుక బుకింగ్ కేంద్రాలు

జిల్లాలో ప్రస్తుతం నాలుగు స్టాక్ పాయింట్లలో మాత్రమే ఇసుక అందుబాటులో ఉందన్నారు. కొండాపురం మండలంలోని కె.వెంకటాపురానికి సంబంధించి తాళ్లప్రొద్దుటూరు గ్రామ సచివాలయం ద్వారా ఇసుక బుక్ చేసుకోవచ్చన్నారు. పి.అనంతపురానికి సంబంధించి కొండాపురం-1 గ్రామసచివాలయంలో ఎంపీడీవో సెల్ నెంబరు 9154201161 ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు. వీరపునాయునిపల్లి మండలం ఎర్రబల్లి రీచ్‌కు సబంధించి అదే గ్రామ సచివాలయంలో 7702070590కు, సిద్దవటం మండలంలోని జ్యోతి గ్రామ సచివాలయంలో 7702070934 కు ఫోన్ చేసి ఇసుక బుక్ చేసుకోవాలన్నారు. ప్రస్తుతం ఎర్రబల్లి, పి.అనంతపురం స్టాక్‌పాయింట్లలో మాత్రమే ఇసుక బుకింగ్ రిజిస్ట్రేషన్ జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో గంగాధర్ గౌడ్, ఆర్డీఓలు, సెబ్ ఏఎస్పీ వెంకటరాముడు, గనులు భూగర్భశాఖ ఆర్‌ఐ విమలమ్మ, స్టాక్ పాయింట్స్ ప్రత్యేకాధికారి సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఏ ఫలితాల్లో మొదటి ర్యాంకు



తేజశ్విని

తంబళ్లపల్లె, ఆగస్టు 23: తంబళ్లపల్లె మండలం కన్నెమడుగుకు చెందిన రైతు కె.రఘురాంరెడ్డి, నాగవేణి దంపతుల కుమార్తె తేజశ్విని శుక్రవారం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా విడుదల చేసిన సర్టిఫైడ్ మేనేజ్‌మెంట్ అకౌంటెంట్ (సీఎంఏ) ఫైనల్ ఫలితాల్లో ఆలిండియా మొదటి ర్యాంకు సాధించింది. సీఏ చేయాలనే పట్టుదలతో సీఎంఏ పరీక్షల ఫలితాల్లో జాతీయ స్థాయిలో మొదటి ర్యాంకు సాధించింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారులు, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు అభినందించారు.

రైల్వేకోడూరులో..

స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ

● స్వర్ణ గ్రామపంచాయతీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యం ● కూటమి ప్రభుత్వంతోనే గ్రామాలు బలోపేతం

● ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ● మైసూరివారిపల్లె గ్రామసభ విజయవంతం



మైసూరివారిపల్లె గ్రామ సభలో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్

రైల్వేకోడూరు, ఆగస్టు 23: రైల్వేకోడూరులో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ ఏర్పాటు చేస్తామని తద్వారా రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తెలిపారు. శుక్రవారం రైల్వేకోడూరు మండలంలోని మైసూరివారిపల్లె జనసేన మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభకు ఆయన హాజరయ్యారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి, వందేమాతరం గేయాన్ని విద్యార్థులు ఆలపించిన అనంతరం సభ ప్రారంభించారు. ఈ సందర్భంగా పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ గ్రామాలు పచ్చగా ఉంటేనే దేశం పచ్చగా ఉంటుందన్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నిర్వీర్యమైపోయిన సమయంలో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత సగర్వంగా గ్రామ సభలను నిర్వహించుకుంటున్నామని తెలిపారు. గత ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా చేస్తే.. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో నిధులు ఇచ్చి బలోపేతం చేస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 13,326 పంచాయతీల్లో గ్రామ సభలను నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పంచాయతీలను స్వర్ణ పంచాయతీలుగా తీర్చిదిద్దడమే గ్రామసభ లక్ష్యమని తెలిపారు. రైల్వేకోడూరును పండ్ల రాజధానిగా చేస్తామని అన్నారు. రైల్వేకోడూరులో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్శిటీ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ఇక్కడ నైపుణ్య విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తే రైల్వేకోడూరు ప్రాంతమే కాకుండా మొత్తం రాయలసీమ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని ఒక మహిళ ద్వారా తెలుసుకున్నానని తెలిపారు. అన్నమయ్య డ్యాం తెగిపోయినప్పుడు జరిగిన నష్టాన్ని చూసి తన హృదయం చలించిపోయిందన్నారు. ఆ పరిస్థితిలో తనకు అధికారం ఉంటే ఏదో ఒకటి చేయగలిగే వాడినని తెలిపారు. యువత నుంచి తాను కోరుకునేది ఒకటేనని.. అదే సామాజిక బాధ్యత అని యువతకు సందేశం ఇచ్చారు. అదేవిధంగా మంగంపేట బెరైటీస్‌పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, మంగంపేటలో ఉద్యోగాలను యువతకు ఇప్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. మైసూరివారిపల్లెలో పక్కా గృహాలు కావాలని అడిగారని వెంటనే మంజూరు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వెంటనే ఏపీఎండీసీపై దృష్టి సారించాలని కలెక్టర్‌ను ఆదేశించారు. అదేవిధంగా రైతులకు పంటను గిట్టుబాటు ధరలకు అమ్ముకునేందుకు శీతలగిడ్డంగి ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో ప్రత్యేకంగా పర్యవేక్షించి ఏర్పాటు చేయిస్తామన్నారు. ఆస్పత్రి కూడా ఏర్పాటు చేయిస్తామన్నారు. అరటికి బీమా రావడం లేదని రైతులు చెప్పడంతో దీన్ని కూడా పర్యవేక్షిస్తామని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం వ్యవస్థల్ని ఛిన్నాభిన్నం చేసిందని, పంచాయతీరాజ్ వ్యవస్థను నాశనం చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. మైసూరివారిపల్లె మహిళా సర్పంచ్ కారుమంచి సంయుక్త భర్త వెంకటసుబ్బయ్య మాజీ సైనికుడు అని, ఆయన భౌతికంగా లేకపోయినా గ్రామ ప్రజలు అండగా నిలిచి పంచాయతీ సర్పంచ్‌గా గెలిపించడంతో తన గుండె కదిలిందన్నారు. ఇలాంటి ఆడబిడ్డ రాజకీయాల్లో ఉండాలని అనుకున్నామని తెలిపారు.

అనంతరం మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్త మాట్లాడుతూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ తమ గ్రామ పంచాయతీకి రావడం సంతోషంగా ఉందన్నారు. ఉద్యాన పంటలకు బీమా సౌకర్యం కల్పించాలని, గుంజననదికి రక్షణగోడ నిర్మాణం, సీసీ రోడ్లు, అండర్ డ్రైనేజి సౌకర్యం కావాలని కోరారు. ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మాట్లాడుతూ రైల్వేకోడూరును ఆంధ్రప్రదేశ్ ఉద్యాన రాజధానిగా పిలుస్తారన్నారు. ఏపీఎండీసీలో రైల్వేకోడూరు స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నారు. కలెక్టర్ చామకూరి శ్రీధర్ మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా పరిపాలన పారదర్శకత, జవాబుదారీ తనాన్ని బలోపేతం చేయవచ్చని తెలిపారు. ఉప ముఖ్యమంత్రి ఇచ్చిన స్ఫూర్తితో జిల్లాను ముందుకు తీసుకెళ్లడానికి అన్ని విధాల కృషి చేస్తామన్నారు.

రాష్ట్ర రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్టీరామారావు తర్వాత చలనచిత్ర పరిశ్రమ నుంచి వచ్చి రాజకీయంగా బలమైన నేతగా ఎదిగిన నాయకుడు పవన్‌కళ్యాణ్ అని కొనియాడారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వంలో గ్రామాలు బలోపేతం అవుతాయని, గత ప్రభుత్వం గ్రామాలను నిర్వీర్యం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో రైల్వేకోడూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముక్కా రూపానందరెడ్డి, రాయలసీమ జోన్ ఇన్‌చార్జులు పగడాల వెంకటేశ్, జోగినేని మణి, జనసేన నాయకుడు యనమల భాస్కర్‌రావు, జనసేన కడప నియోజకవర్గ ఇన్‌చార్జి సుంకర శ్రీనివాస్, జిల్లా స్థాయి అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మైదానానికి 30 సెంట్ల స్థలం వితరణ

మైసూరివారిపల్లెలో ప్రభుత్వ భూమి 8 సెంట్లు మాత్రమే ఉండడం ఆశ్చర్యంగా ఉందని పవన్ కళ్యాణ్ అన్నారు. యువత, విద్యార్థులు క్రీడా మైదానం కావాలని కోరుతున్నారని, దాతలు ముందుకు వస్తే ఆటస్థలం ఏర్పాటు చేస్తామన్నారు. వెంటనే స్పందించిన రైతు కారుమంచి నారాయణ తనకు ఉన్న 30 సెంట్ల స్థలాన్ని ఇస్తానని ప్రకటించడంతో పవన్‌కళ్యాణ్ ఆయనను వేదికపైకి పిలిచి అభినందించారు.



30 సెంట్ల స్థలాన్ని ఇచ్చిన నారాయణను అభినందిస్తున్న పవన్‌కళ్యాణ్

ఘనస్వాగతం

గ్రామసభకు విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌కు కూటమి నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో పవన్ రేణిగుంట విమాశ్రయంలో దిగారు. అక్కడి నుంచి రోడ్డుమార్గాన 10:40 గంటలకు మైసూరివారిపల్లెకు చేరుకున్నారు. పవన్‌కళ్యాణ్‌కు అడుగడుగునా ప్రజలు నీరాజనాలు పలికారు. సభ మధ్యాహ్నం 12:40కు ముగియగా, 1:20కు రాజంపేటకు బయలుదేరివెళ్లారు.

హైలెవల్ కమిటీ వేసి న్యాయం చేస్తా

● అన్నమయ్య ప్రాజెక్టు బాధితులకు..

● డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ హామీ



అన్నమయ్య ప్రాజెక్టు తెగిపోయినప్పటి ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలిస్తున్న పవన్‌కళ్యాణ్

రాజంపేట, ఆగస్టు 23: అన్నమయ్య ప్రాజెక్టు ముంపు బాధితులను అన్నివిధాల ఆదుకుంటామని ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ హామీ ఇచ్చారు. రైల్వేకోడూరు గ్రామసభ ముగిసిన అనంతరం సాయంత్రం 4:30 గంటలకు పులపత్తూరులో ఏర్పాటు చేసిన గ్రామసభకు ఆయన హాజరయ్యారు. అక్కడ ముంపు బాధితులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా మందపల్లె గ్రామానికి చెందిన బాధితులు, సీనియర్ టీడీపీ నాయకులు కొండా శ్రీనివాసులు, అడపాల సురేశ్, రామన్నగారి రజని తదితరులు తమ సమస్యలను పవన్‌కళ్యాణ్ ఎదుట ఏకరుపెట్టారు. ప్రాజెక్టు తెగిపోయి మూడు సంవత్సరాలైనా ఇంతవరకు తమకు ఎటువంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేవలం వైసీపీ ఓటుబ్యాంకు ఉన్న పులపత్తూరు గ్రామానికే నాటి సీఎం జగన్ అన్ని విధాల న్యాయం చేశారని, తమ గ్రామాలకు ఎటువంటి న్యాయం చేయలేదన్నారు. పాలేశ్వరస్వామి ఆలయం కొట్టుకుపోయినా తిరిగి పునరుద్ధరించలేదన్నారు. వ్యవసాయ రుణమాఫీలు చేస్తామని చెప్పి ఇప్పటికి అతీగతీ లేదన్నారు. అనంతరం పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ.. ముంపు బాధిత ప్రజల బాధను అర్థం చేసుకున్నానని, సంఘటన జరిగినప్పటి నుంచి ఇప్పటివరకు సరైన పర్యవేక్షణ జరగలేదన్నారు. ఈ సంఘటనపై హైలెవల్ కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ చేసి తక్షణం చర్యలు తీసుకుంటామన్నారు. నాడు అనేక మందిని కాపాడిన లష్కర్ రామయ్యను అభినందించామన్నారు. వరద ప్రాంతాల ఫొటో ఎగ్జిబిషన్ పరిశీలించానని, ఉప ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి ఈ సమస్యను ప్రత్యేకంగా పర్యవేక్షించి ఉన్నతాధికారుల బృందంతో విచారణ చేయిస్తానన్నారు. అన్నమయ్య ప్రాజెక్టును పునర్నిర్మాణం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ రాష్ట్ర కమిషనర్ వీఆర్ కృష్ణతేజ, కలెక్టర్ శ్రీధర్, జేసీ ఆదర్శ రాజేంద్రన్, సబ్‌కలెక్టర్లు నిధియాదేవి, మేఘస్వరూప్, తిరుపతి, కోడూరు ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, శ్రీధర్, జనసేనపార్టీ నాయకులు అతికారి కృష్ణ, అతికారి దినేష్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు, బీజేపీ నాయకుడు నాగోతు రమేశ్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

గందరగోళంగా పులపత్తూరు సభ

పులపత్తూరులో జరిగిన ముంపుబాధితుల గ్రామసభ గందరగోళంగా సాగింది. ఏర్పాట్లు చేయడంలో యంత్రాంగం పూర్తిగా విఫలమైంది. అక్కడ కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయకపోగా, గ్రామసభలో ఉప ముఖ్యమంత్రి కూర్చొని మాట్లాడే వేదికను సక్రమంగా ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిచ్చింది. పవన్‌కళ్యాణ్ సభ మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభించాల్సి ఉండగా సాయంత్రం ఐదు గంటలైంది. ఉదయం నుంచి అటు బాధిత గ్రామాల ప్రజలు, అధికారులు చూసి చూసి విసిగిపోయారు. వారికి భోజన వసతి కూడా లేకపోవడంతో అప్పటికప్పుడు టీడీపీ జిల్లా అధ్యక్షుడు జగన్‌మోహన్‌రాజు వందలాది మందికి భోజనాలు ఏర్పాటు చేశారు. సభాస్థలి ప్రాంతంలో ఒక్క పోలీసు కూడా లేకపోవడంతో యువకుల హంగామా ఎక్కువైంది. పవన్ రాగానే ఒక్కసారిగా వారంతా ముందుకు దూసుకెళ్లిపోయారు. పవన్ జిందాబాద్ అంటూ కేరింతలు కొట్టారు. దీంతో ఉపముఖ్యమంత్రి స్థాయిలో జరిగే ప్రభుత్వ కార్యక్రమం రిలీజ్ రోజున సినిమాలో తొక్కిసలాటగా మారిపోయింది. దీనివల్ల అన్నమయ్య ప్రాజెక్టు బాధిత ప్రజలు తమ గోడు చెప్పుకోవడం దేవుడెరుగు చాలామందికి ఉప ముఖ్యమంత్రిని చూసే భాగ్యం కూడా లేకుండా పోయింది. ఇక్కడి కార్యక్రమం ముగిసిన అనంతరం పవన్‌కళ్యాణ్ రోడ్డు మార్గాన బయలుదేరి రేణిగుంట వెళ్లారు.

గత ప్రభుత్వాలు చేపట్టిన ప్రాజెక్టు కానీ అమలు చేసిన పథకాలు, అభివృద్ధి పనుల్లో లోపాలుంటే కొత్త ప్రభుత్వం సరిచేయాలి. అక్రమాలు జరిగింటే చర్యలు తీసుకోవాలి. అయితే కేవలం చంద్రబాబు హయాంలో మంజూరైనవి అనే కారణంగో జగన్ ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణాల బిల్లులు ఐదేళ్లుగా నిలిపివేంది. ఇది లక్షో రెండు లక్షలో కాదు.. దాదాపు రూ.33 కోట్ల బిల్లులు పెండింగ్ పెట్టడంతో అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్న పేదలు వాటికి వడ్డీలు కట్టుకోలేక ఐదేళ్లుగా అల్లాడుతున్నారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం ఎన్టీఆర్ గృహ నిర్మాణాల బిల్లులకు పచ్చజెండా ఊపడంతో పేదలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్నాళ్లకెన్నాళ్లకు..

● ఎన్టీఆర్ గృహ నిర్మాణదారులకు శుభవార్త

● రూ.32.91 కోట్ల బకాయిలు ఇవ్వాలని టీడీపీ ప్రభుత్వ నిర్ణయం

● జగన్ హయాంలో బిల్లులు నిలిపివేత



(కడప-ఆంధ్రజ్యోతి): జగన్ పాలనలో టీడీపీ, జనసేన నేతలు మాత్రమే కాదు.. సొంత గూడు లేని పేదలు కూడా ఆయన బాధితులే. కేవలం చంద్రబాబు హయాంలో పక్కా గృహాలు పొందారన్న రాజకీయ కక్షతో ఏకంగా పేదల ఇళ్లకు చెందిన ఇంటి బిల్లులనే నిలిపివేసి తన మార్కు చూపించారు. గతంలో ఎన్నడూ లేని పరిస్థితి జగన్ హయాంలోనే దాపురించింది. టీడీపీ హయాంలో చేపట్టిన నీరు-చెట్టు పనులు మొదలుకుని ఇతర కాంట్రాక్టు పనుల బిల్లులన్నీ ఆపివేశారు. అదే కోవలో ఎన్టీఆర్ గృహనిర్మాణాల లబ్ధిదారులకు కూడా బిల్లులు ఇవ్వలేదు. రూపాయి రెండు రూపాయలు కాదు రూ.32.91 కోట్లు నిధులను ఆపివేశారు. సుమారు 19వేల మంది లబ్ధిదారులు బిల్లుల కోసం తిరిగి తిరిగి విసిగిపోయారు. అలాంటి వారికి కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు అప్పటి ఇళ్ల నిర్మాణాలు ఏ దశలో ఉన్నాయి.. ఎంత మేర బకాయిలు ఉన్నాయి.. మొత్తం ఎన్ని ఇళ్లు, ఎంత అమౌంటు తెలుసుకోవాలంటూ ఇంటింటికీ వెళ్లి పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించింది. సెప్టెంబరు 10లోపు లబ్ధిదారుల జాబితా, చెల్లింపు వివరాలను పరిశీలించాలని ఆదేశించింది. దీంతో గృహ నిర్మాణశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించనున్నారు.

సుమారు లక్ష ఇళ్లు నిర్మాణం

విభజిత రాష్ట్రంలో 2014-19సంవత్సరంలో చంద్రబాబునాయుడు సీఎంగా ఉన్నారు. అప్పుడు ఇళ్లు లేని పేదలకు సొంత గూడు కల్పించేందుకు ఎన్టీఆర్ గ్రామీణ, అర్బన్, రూరల్ పథకాల పేరిట కార్పొరేషన్, మున్సిపాలిటీలు, గ్రామీణ ప్రాంతాల్లో పక్కాగృహాల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. జిల్లాలో సుమారు సుమారు లక్ష దాకా ఇంటి నిర్మాణాలు మొదలుపెట్టారు. 2016 నుంచి 2019 వరకు పెద్దఎత్తున నిర్మాణాలు చేపట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రూ.2.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.3లక్షల మేర ఇంటి నిర్మాణాలకు ఇచ్చేవారు. ఇక ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ ద్వారా ఆ సామాజిక వర్గాలకు రూ.75వేలు అదనంగా ఇచ్చేవారు. అప్పట్లో ఉచిత ఇసుకతో పాటు నిర్మాణ సామగ్రి మొదలుకుని అన్నీ అందుబాటులో ఉండేవి. అప్పట్లో సుమారు లక్ష మేర ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

ఐదేళ్లుగా బిల్లులు ఆపేశారు

2019లో అధికారం మారింది. జగన్ ప్రభుత్వం కొలువుదీరింది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణాలు పూర్తి చేసుకున్న ఎన్టీఆర్ గృహ నిర్మాణ లబ్ధిదారులకు జగన్ ప్రభుత్వం బిల్లులు నిలిపివేసింది. రకరకాల కొర్రీలు పెట్టి విచారణ అంటూ కాలయాపన చేసి చివరకు పట్టించుకోవడం మానివేసింది. జిల్లాలో సుమారు 19వేల మందికి రూ.32,91,86,529 పెండింగు పెట్టింది. ఆ బిల్లుల కోసం లబ్ధిదారులు కాళ్లరిగేలా తిరిగారు. ఇళ్లు మంజూరు చేసి ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుండటంతో అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నారు. బిల్లు వస్తాయని వేచిచూశారు. మరి కొందరు బిల్లులు రాకపోవడంతో ఇళ్లనిర్మాణాలను ఎక్కడివక్కడ ఆపేశారు. ఇప్పుడు చంద్రబాబు మళ్లీ సీఎం కావడంతో ఎన్టీఆర్ గృహ నిర్మాణదారులకు బిల్లులు చెల్లించేందుకు సిద్ధమయ్యారు. ఆ మేరకు గృహ నిర్మాణశాఖ అధికారులు, సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఎన్టీఆర్ గృహ నిర్మాణం స్టేటస్ పరిశీలిస్తున్నారు. ఎంత వరకు పూర్తయింది, ఎంత బిల్లు వచ్చింది గుర్తించి వారి బ్యాంకు వివరాలు తీసుకుని నేరుగా బిల్లులు చెల్లించనున్నారు.

త్వరలో బిల్లులు చెల్లిస్తాం..

ఎన్టీఆర్ గృహ నిర్మాణ స్థలాల లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాలని ప్రభుత్వం నిర్ణయించింది. నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలిస్తున్నాం. నివేదికను ప్రభుత్వానికి పంపిస్తాం, ప్రతి ఒక్కరికీ బిల్లులు చెల్లిస్తాం.

- క్రిష్ణయ్య, గృహ నిర్మాణశాఖ పీడీ

పల్లెలకు మహర్దశ

● సమగ్రాభివృద్ధికి డీపీఆర్ రూపకల్పన

● జిల్లావ్యాప్తంగా గ్రామసభలు



తొండూరు గ్రామసభకు హాజరైన జేసీ అదితి సింగ్

కడప, ఆగస్టు 23 (ఆంధ్రజ్యోతి): జగన్ హయాంలో నిరాదరణకు గురైన గ్రామ పంచాయతీలకు కూటమి ప్రభుత్వంతో మళ్లీ మహర్దశ పట్టనుంది. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లు గ్రామాల సర్వతోముఖాభివృద్ధికి నడుం బిగించారు. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. గ్రామాలకు ఏమి అవసరమో వాటిని ప్రజల చేత గ్రామసభల్లో గుర్తించి వాటిని ప్రాధాన్యత పరంగా నిర్వహణ చేపట్టేందుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఎప్పుడూ లేని విధంగా ఒకే రోజు రాష్ట్రవ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించారు.

జిల్లాలో 562 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. రాత్రి వరకు గ్రామసభలు జరుగుతూనే ఉన్నాయి. తొండూరులో జరిగిన గ్రామసభకు జాయింట్ కలెక్టర్ అదితిసింగ్, డ్వామా పీడీ విజయకుమార్ హాజరయ్యారు. కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల, ప్రొద్దుటూరు, మైదుకూరు, బద్వేలు నియోజకవర్గాల్లో గ్రామసభలు జరిగాయి. ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి సీకేదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి గ్రామసభల్లో పాల్గొన్నారు. తొండూరు, పులివెందుల గ్రామసభల్లో మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి పాల్గొన్నారు. ప్రొద్దుటూరు మండలం సోమలరాజుపల్లెలో ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పాల్గొన్నారు. బి.కోడూరులో టీడీపీ నేత రితీశ్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామసభల్లో మండల పరిషత్, ఉపాధి హామీ, పంచాయతీరాజ్, సెరికల్చర్, వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు పాల్గొన్నారు.

భారీ స్థాయిలో వినతులు

గ్రామాలకు ఏం మౌలిక వసతులు అవసరమో వాటిని జనాల నుంచే స్వీకరించాలని నిర్ణయించడంతో గ్రామసభలకు పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చాయి. ఉపాధి హామీ అధికారులు ప్రత్యేక యాప్‌ల ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా సిమెంటు రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టనున్నారు. అంటే ఒక్కో నియోజకవర్గంలో దాదాపు రూ.20 కోట్లు సిమెంటు రోడ్లు, డ్రైనేజీలు వెచ్చించనున్నారు. ఇక పశువులు, మేకలు గొర్రెల కోసం షెడ్లు నిర్మిస్తారు. జిల్లాకు 875 షెడ్లు మంజూరు అయ్యాయి. ఒక్కో షెడ్డును రూ.1.20 కోట్లతో నిర్మించనున్నారు.

సెంట్రల్ జైల్ సూపరింటెండెంట్‌గా రాజేశ్వరరావు

● ఇక్కడ పనిచేస్తున్న ప్రకాశ్ నెల్లూరుకు బదిలీ ● ఆరోపణలే బదిలీకి కారణమా..?

కడప (క్రైం), ఆగస్టు 23: కడప కేంద్ర కారాగార పర్యవేక్షణ అధికారిగా రాజేశ్వరరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయనకు కడప జైళ్ల శాఖ డీఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. గతంలో డీఐజీగా రవికుమార్ పనిచేసి బదిలీ అయ్యారు. అప్పటి నుంచీ ఎవరినీ నియమించలేదు. ఇన్‌చార్జిలుగా బాధ్యతలు ఇచ్చారు. ఇక కడపసెంట్రల్ జైలు పర్యవేక్షణ అధికారిగా పనిచేస్తున్న ప్రకాశ్‌ను నెల్లూరు జైలులో సిబ్బంది శిక్షణ కేంద్రానికి బదిలీ చేశారు. ప్రకాశ్ ఇక్కడ పర్యవేక్షణ అధికారిగా ఉన్నప్పుడు తీవ్ర ఆరోపణలు వచ్చాయి. అప్పట్లో వివేకా హత్య కేసు నిందితులు సెంట్రల్ జైల్లో ఉన్నారు. కోర్టు తీర్పుమేరకు వివేకా హత్య కేసు విచారణను తెలంగాణకు బదిలీ చేశారు. అప్పట్లో కడప సెంట్రల్ జైల్లో ఉన్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఇతర నిందితులందరినీ హైదరాబాద్‌కు తరలించారు. ఇక వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన డ్రైవర్ దస్తగిరి వేరే రెండు కేసుల్లో ఇక్కడ రిమాండ్‌లో ఉన్నారు. ఆ సమయంలో వివేకా హత్య కేసు నిందితుడు దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డి మెడికల్ క్యాంప్ పేరుతో వచ్చి జైల్లో తనను ప్రలోభాలకు గురిచేశారంటూ దస్తగిరి ఆరోపణలు చేశారు. ఇది అప్పట్లో తీవ్ర దుమారం రేపింది. అప్పుడు జగన్ అధికారంలో ఉండడంతో జైలు సిబ్బంది అంతా వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆయన బదిలీ ప్రాధాన్యత సంతరించుకుంది.

పాకల్లోనే బతుకులు - 'కూటమి'పై ఆశలు



భారతావని వజ్రోత్సవాలు దాటినా మారని తలరాతలు ● పక్కా ఇళ్ల కోసం ఎదురుచూపులు

అర్హులకు అన్యాయం చేసిన వైసీపీ ● ఎన్‌టీఆర్ గృహనిర్మాణం ఇళ్లకు నిధులు కోరిన లబ్ధిదారులు

సుండుపల్లె, ఆగస్టు 23: సుమారు 78 ఏళ్ల స్వతంత్ర్య భారతావనిలో ఇంకా పేదల బతుకులు పాకలకే పరిమితమ య్యాయి. ప్రజాస్వామ్యంలో అంతా సమానమే అన్న పాలకుల ప్రకటనలు కాగితాల్లోనే మిగిలిపోయాయి. ఇంతజేసినా బడుగు బలహీన వర్గాల తలరాతలు నేతలు మార్చలేకపోతున్నారు. వేగం పెంచి ఇంటర్‌నెట్ సేవలు పరిగెడు తున్నా పేదల బతుకులు బోదకొట్టాలు, టెంకాయ పట్టలతో నిర్మితమైన పాకలు, అడవిలో దొరికే తడికలతో వేసుకున్న గుడిసెల్లోనే నిలుచున్నాయి. పేదల సొంతింటికల నెరవేరుస్తానని ప్రకటనలు గుప్పించి గంపగుత్తగా ఓట్లు దండుకున్న వైసీపీ అధినేత జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా అధికారం చేపట్టి పేదలను విస్మరించారు. మోస గించబడిన పేదలు వైసీపీ ప్రభుత్వానికి సమాధికట్టారు. ప్రస్తుతం అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వంపై పేద లు ఆశలు పెట్టుకున్నారు. వివరాల్లోకెళితే...

వజ్రోత్సవాలు దాటిన భారత్‌లో వేగవంతమైన 4జీ, 5జీ ఇంటర్నెట్ సేవలు వినియోగిస్తున్న సమయంలో కాలనీలు, యానాది కాలనీలు, దళితవాడల్లో నిరుపేద కుటుంబాలు బోదకొట్టాలు, టెంకాయ పట్టలతో నిర్మించిన పాకలు, తడికలతో గుడిసెలు వేసుకుని జీవనం సాగిస్తున్నారు. పేదల సొంతింటికల నెరవేరుస్తానని, అదే నా లక్ష్యమని, జగనన్న కాలనీలు నిర్మిస్తామని చెప్పి మోస గించారు. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. పేదరికంతో జీవనం సాగిస్తున్న గిరిజనులకు సొంతింటికల నెరవేరుతుందని ఆశతో ఎదురు చూస్తున్నారు. జనార్ధన్‌రెడ్డి (యానాదికాలనీ), అక్కంపల్లె యానాది కాలనీ సహా మరికొన్ని గ్రామాల్లో ప్రజలు పాకల్లో, వసారాల్లో, పాలిథిన్ పట్టల పూరి గుడిసెల్లో, శిథిలమైన మట్టి గృహాల్లో బతుకు సాగిస్తున్న పేదలు ఆశలు పెట్టుకున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు భూమి ఇచ్చి రూ.4 లక్షలతో ఇళ్లు నిర్మిస్తామని కూటమి ప్రభుత్వం ప్రకటించడంతో పేదల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. వైసీపీ ప్రభుత్వం గృహ నిర్మాణం కింద పేదలకు సొంత ఇళ్లు నిర్మించి ఇవ్వలేదు. ప్రధాన మంత్రి గ్రామీణ ఆవాస్ యోజన కింద రెండేళ్ల కిందట 2022 ఏప్రిల్ నుంచి 2430 ఇళ్లు మంజూరు చేశారు. వాటిలో 948 ఇళ్లు మాత్రమే పూర్తి చేశారు. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. చేయూత ఇస్తుందనుకున్న వైసీపీ ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయకపోగా పనులు ఆగిపోయాయి.

అందని బిల్లులు

ఐదేళ్ల కిందట ఎన్టీఆర్ గృహ నిర్మాణం పథకం కింద 14 పంచాయతీల్లోని పేదలకు గృహాలు మంజూరు చేశారు. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు అరకొరగా బిల్లులు చెల్లించింది. ఇంకా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించాల్సి ఉండగా ప్రభుత్వం మారింది. వైసీపీ అధికారం చేపట్టడంతో టీడీపీ ప్రభుత్వం మంజూరు చేసిన గృహాలకు బిల్లులు మంజూరు చేయలేదు. ఫలితంగా కొందరు అప్పు చేసి ఇంటి నిర్మాణాలు చేశారు. మరికొందరు ఇంటి నిర్మాణాలు చేయలేని పరిస్థితిలో ఉన్నారు. దీంతో నిర్మాణాలు పూర్తి చేయలేక పేదలు ఇబ్బందులకు గురవుతున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 500కుపైన 'ఎన్టీఆర్ గృహ నిర్మాణం' ఇళ్లకు బిల్లులు వేయాల్సి ఉంది. అప్పట్లో నిర్మాణాలు ప్రారంభించిన ఇళ్లకు కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వాలని, నిర్మాణాలు పూర్తి చేసేందుకు అదనంగా ఇవ్వాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

పట్టాలిచ్చారు... స్థలం లేదు !

మండలంలో జగనన్న ఇంటి పట్టాల పంపిణీ అంతా మాయాజలంగా జరిగింది. పేదలకు ఇంటి పట్టాలు ఇస్తున్నాము. అర్హులను గుర్తించామని డప్పు కొట్టుకున్న వైసీపీ నేతలు, ఇంటి పట్టాలు ఇచ్చారు కానీ స్థలం చూపలేదు. పేపర్ల మీద అంకెల గారడీతో ప్రజలను మోసగించారని తీవ్ర విమర్శలున్నాయి. 200 మంది లబ్ధిదారులను గుర్తించి జగనన్న ఇంటి పట్టా పేరిట పుస్తకాలు పంపిణీ చేశారు. కానీ ఇంటి స్థలం చూప లేదని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు అడిగితే ఈ రోజు రేపు అని ఐదేళ్లు దాటవేశారు. ఈ ప్రభుత్వంలోనైనా నిజమైన అర్హులను గుర్తించి ఇంటి పట్టాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇంటి పట్టాలకు ఇంటి స్థలం చూపించాలని లబ్ధిదారులు కోరుకుంటున్నారు.



బోదకొట్టం ఊయలలో నిద్రపోతున్న చిన్నారి

ప్రభుత్వం నిధులు విడుదల చేయాలి

వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి నిర్మాణానికి రూ.1.80 వేలు ప్రభుత్వం చెల్లిం చింది. పెండింగ్‌లో ఉండే ఇంటి నిర్మాణాలకు కూటమి ప్రభుత్వం నగదు విడుదల చేయాల్సి ఉంది. త్వరితగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేయించాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు ఉన్నాయి. 2014 టీడీపీ ప్రభుత్వంలో ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం కింద మంజూరైన, కట్టుకున్న ఇంటి నిర్మాణ దారుల వివరాలు సేకరిస్తున్నాము. మండల వ్యాప్తంగా 500 మంది లబ్ధిదారులు ఉన్నట్లు వారికి ప్రభుత్వం నుంచి నిధులు రావాల్సి ఉంది. కొత్తగా ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే అర్హులకు పక్కా గృహాలు మంజూరయ్యేలా చూస్తాము.

నాగరాజు, హౌసింగ్ ఏఈ

పట్టా ఇచ్చారు.. స్థలం చూపలేదు



వైసీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం దరఖాస్తు చేసుకున్నాము. అర్హులుగా ప్రభుత్వం గుర్తించి ఇంటి పట్టా మంజూరు చేసింది. అనంతరం జగనన్న ఇంటి పట్టా ఇచ్చినా స్థలం చూపించలేదు. అధికారులను అడిగితే ఇప్పుడు పట్టించుకోవడం లేదు. అక్కం పల్లి గుట్టపై గుడిసెలో నివాసం ఉంటున్నాము. స్థలం చూపిస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాము.

లక్ష్మీదేవి, అక్కంపల్లి

బోద గుడిసెలో కాపురం



ఓ దాత ఇంటి స్థలం ఇచ్చారు. బోద గుడిసె వేసుకుని కాపురం చేస్తున్నాము. వైసీపీ ప్రభుత్వంలో గృహ నిర్మాణం కోసం అర్జీలు పెట్టుకున్నాము. ఇంటి నిర్మాణానికి అనుమతులు రాలేదు. ప్రస్తుతం ఇంటి నిర్మాణం చేసుకుంటే రూ.4 లక్షలు ప్రభుత్వం చెల్లిస్తుందని అంటున్నారు. పక్కా గృహం మంజూరు చేస్తే ఇంటి నిర్మాణం చేసుకుంటాము.

కృష్ణవేణి, జనార్ధన్‌రెడ్డి నగర్ కాలనీ

చరిత్రలో నిలిచిపోతారు



కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంటి నిర్మాణానికి లబ్ధిదారులకు రూ.4 లక్షలు ఇస్తామని ప్రకటించారు. చరిత్రలో ఏ సీఎం చేయని విధంగా పేదల కోసం చంద్రబాబు ప్రకటించారు. లబ్ధిదారులకు నాలుగు లక్షలు ఇస్తే ఇంటి నిర్మాణం సులభతరం అవుతుంది. ప్రతి పేదవాడి సొంతింటి కల నెరవేర్చాలన్న నిర్ణయం చారిత్రాత్మకం.

శ్రీధర్, బేరిపల్లి

సన్నీ సేవలు అభినందనీయం : ఎస్పీ

పోలీసు జాగిలం బాధ్యతా విరమణలో ఘనసన్మానం





పెరేడ్‌లో మంత్రి ఫరూక్‌తో సన్నీ (ఫైల్ ఫొటో) - సన్నీని సన్మానిస్తున్న ఎస్పీ

కడప (క్రైం), ఆగస్టు 23: పోలీసు జాగిలం సన్నీ 11 ఏళ్లపాటు విశిష్ట సేవలందించి పలు కీలక విధులను సమర్థవంతంగా నిర్వర్తించడం అభినందనీయమని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు అన్నారు. శుక్రవారం స్థానిక పెన్నార్ పోలీసు హాలులో సన్నీ బాధ్యతా విరమణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పేలుడు పదార్థాలను గుర్తించడంలో నేర్పరిగా పేరున్న లాబ్రడార్ జాతికి చెందిన జాగిలం సన్నీని ఎస్పీ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. సుదీర్ఘకాలం పోలీసుశాఖలో విధులు నిర్వర్తించి బాధ్యతా విరమణ సందర్భంలో కూడా సంపూర్ణ ఆరోగ్యంతో చురుగ్గా ఉండేలా కంటికి రెప్పలా చూసుకున్న హ్యాండ్లర్ ఎన్‌వీ సుధీర్‌రాజుని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. మున్ముందు కూడా జాగ్రత్తగా చూసుకోవాలని ఎస్పీ ఆకాంక్షించారు. జాగిలాలతో అనుబంధం భావోద్వేగాలతో కూడుకుని ఉంటుందంటూ పెంపుడు జాగిలంతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. సీఎం బందోబస్తు విధులు, వీవీఐపీ, వీఐపీ, క్రిష్ణా,గోదావరి పుష్కరాల్లో, తిరుమల బ్రహ్మోత్సవాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించి ప్రశంసలు పొందడం అభినందనీయమన్నారు. స్వాతంత్ర్య, రిపబ్లిక్ వేడుకల పెరేడ్‌లో ప్రదర్శన చేసి ప్రతిభ కనబరిచిందన్నారు. ఇటీవల సార్వత్రిక ఎన్నికల ప్రక్రియలో భాగంగా బందోబస్తు విధుల్లో, కౌంటింగ్ సెంటరు వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వహించిందన్నారు. ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు మాట్లాడుతూ 26.12.2012లో జన్మించిన సన్నీ ఏడాది పాటు శిక్షణ పొందిన అనంతరం 30.11.2013న జిల్లా పోలీసుశాఖలో సేవలను ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్ఐలు ఆనంద్, వీరేశ్, టైటస్, శ్రీశైలరెడ్డి, ఆర్ఎస్ఐలు స్వామినాయక్, వెంకటేశ్వర్లు, అప్పలనాయుడు, పావని, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ పేరుతో చితకబాదారు : ఎమ్మార్పీఎస్



సీఐతో మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నేతలు

ముద్దనూరు ఆగస్టు23: హత్యకేసుకు సంబంధించి విచారణ పేరుతో దళితుడు సురేంద్రను సీఐ దస్తగిరి చితకబాదాడని ఎమ్మార్పీఎస్ నేతలు ఆరోపించారు. జిల్లాలోని అన్ని కేంద్రాల నుంచి ఎమ్మార్పీఎస్ నేతలు శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్దకు భారీ ఎత్తున తరలివచ్చి సీఐతో మాట్లాడారు. జిల్లా నేత విశ్వనాథ్ మాదిగ విలేకరులతో మాట్లాడుతూ వేల్పుచర్ల వాసి సురేంద్ర చిన్నాన్న కొడుకు నాగరాజు ఈ ఏడాది ఏప్రిల్ 24న మంగపట్నం సమీప రైల్వే పట్టాలపై మృతి చెంది పడిఉన్నాడు. ఎర్రగుంట్ల రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి ఈ నెల 4వతేదీన ముద్దనూరు పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేశారు. కాగా సీఐ దస్తగిరి కేసును తప్పుదారి పట్టించేందుకు విచారణ పేరుతో మృతుని కుటుంబ సభ్యులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. సురేంద్రను హత్యకేసు ఒప్పుకోమని హింసించారన్నారు. గతంలో మృతునికి డబ్బు ఇచ్చిన వారు కొట్టారని, వారిని వదిలేసి, దళితులను మాత్రమే పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ఇప్పుడు పొరపాటు జరిగిందని తమకు సీఐ తెలియజేశారన్నారు. ఈవిషయమై ఎస్పీకి ఫిర్యాదు చేస్తామన్నారు. పోలీసులు హత్యకేసుకు సంబంధించి సమగ్ర విచారణ చేసి దోషులపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నేతలు పుల్లయ్యమాదిగ, రామకృష్ణమాదిగ, వెంకటేష్, గంగరాజు, చిన్నయ్య పాల్గొన్నారు.

నాగరాజు అనుమానాస్పద మృతి కేసులో సమగ్ర విచారణ చేస్తామని సీఐ దస్తగిరి అన్నారు. రైల్వే పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, బదిలీ చేశారు. మృతుని ఫోన్ కాల్ డేటాలో సురేంద్ర నంబర్ ఉండడంతో అయనను పిలిపించి విచారించామన్నారు.

డైట్ స్కూల్‌లో ఎల్ఈడీ టీవీ చోరీ

రాయచోటిటౌన్, ఆగస్టు23: స్థానిక డైట్ ఉన్నత పాఠశాలలో గురువారం రాత్రి ఎల్ఈడీ టీవీ చోరీకి గురైంది. పాఠశాల హెచ్ఎం నిర్మలాదేవి వివరాల మేరకు.. విద్యార్థుల సౌకర్యం ప్రభుత్వం సరఫరా చేసిన ఎల్ఈడీ టీవీని పాఠశాలలో ఏర్పాటు చేశారన్నారు. ఆ గది తాళం చెవులు వాచ్‌మెన్ వెంకట్రమణ, ఆయా రాజేశ్వరి, టీచర్ రాంప్రసాద్ వద్ద ఉన్నాయన్నారు. రోజూ పాఠశాల విధులు ముగించుకుని వాచ్‌మెన్ అన్ని గదులకు తాళాలు వేసుకున్న అనంతరం ఇండ్లకు వెళతామన్నారు. ఈ క్రమంలోనే గురువారం సాయంత్రం తాళాలు వేసుకుని వెళ్లామన్నారు. శుక్రవారం ఉదయం వాచ్‌మెన్ వచ్చి టీవీ చోరీకి గురైనట్లు తెలిపాడన్నారు. వెళ్లి చూడగా తరగతి గది తాళాలు పగలగొట్టి ఉన్నాయని, టీవీ చోరీకి గురైనట్లు గుర్తించామన్నారు. అర్బన్ సీఐ చంద్రశేఖర్‌కు ఫిర్యాదు చేసినట్లు హెచ్ఎం తెలిపారు.

వరకట్న వేధింపులపై కేసు నమోదు

వేంపల్లె, ఆగస్టు 23: వేంపల్లె శ్రీరామ్‌నగర్‌కు చెందిన ప్రవళికపై ఆమె భర్త తిరుపతి పాకాలకు చెందిన జవర్‌హబాబు కట్నం కోసం వేధించినట్లు కేసు నమోదు చేసినట్ల సీఐ సురేష్‌రెడ్డి తెలిపారు. రెండేళ్ల కిందట పెళ్లి కాగా అదనపు కట్నం కోసం మానసిక, శారీరకంగా ఇబ్బందులు పెడుతుండడంతో భర్తపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

శభాష్ సాయి, ఓబులేసు



రివార్డు అందుకుంటున్న బ్లూకోల్ట్స్ సిబ్బంది

కడప (క్రైం), ఆగస్టు 23: అనాలోచితంగా ఉరేసుకోబోతున్న ఇంటర్ విద్యార్థినిని కాపాడిన బ్లూకోల్ట్స్ సిబ్బంది అధికారుల, ప్రజల మన్ననలు పొందారు. సెల్‌ఫోను అతిగా వాడొద్దని కుటుంబీకులు మందలించడంతో విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడబోయింది. అందిన సమాచారంతో బ్లూకోల్ట్స్ కానిస్టేబుళ్లు ఎ.సాయిగోపినాథ్, ఓబులేసు విద్యార్థినిని కాపాడారు. ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శుక్రవారం వారిని ప్రత్యేకంగా అభినందించి నగదు రివార్డులు అందించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ వెంకటరాముడు, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, కమాండ్ కంట్రోల్ ఇన్‌స్పెక్టరు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో నేతల భేటీ



పవన్‌కల్యాణ్‌తో భేటీ అయిన నేతలు

రాజంపేట టౌన్, ఆగస్టు 23: డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తో పలువురు నేతలు భేటీ అయ్యారు. రాజంపేట ఆర్అండ్‌బీ అతిథిగృహంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బాలిశెట్టి హరిప్రసాద్, సీనియర్ నేత అతికారి వెంకటయ్య, అతికారి కృష్ణ, దినేష్, మాజీ ఆర్టీసీ ఛైర్మన్ యెద్దల సుబ్బరాయుడు, జనసేన నేతలు యల్లటూరు శ్రీనివాస రాజు, యల్లటూరు శివరామరాజు, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, జనసేన నేతలు నరసయ్య, తుంగా రమణయ్య, సుంకర శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

అంతరిక్షరంగంలో భారత్ సరికొత్త చరిత్ర

ప్రొఫెసరు విశ్వనాధకుమార్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23: చంద్రయాన్3 విజయంతో భారతదేశం అంతరిక్షరంగంలో సరికొత్త చరిత్ర సృష్టించిందని వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్అండ్ ఫైన్‌ఆర్ట్స్ యూనివర్శిటీ వీసీ విశ్వనాధకుమార్ అన్నారు. శుక్రవారం ఏఎఫ్ఏయూలో జాతీయ అంతరిక్ష దినోత్సవం కెనరాబ్యాంకు సహకారంతో నిర్వహించారు. యూనివర్శిటీ ఏర్పాటు చేసిన చంద్రయాన్3 నమూనాను వీసీ ఆవిష్కరించారు. చంద్రుని సౌత్‌పోల్‌పై కాలుపెట్టిన తొలిదేశంగా భారత్ నిలిచిందన్నారు. ఎన్నో అభివృద్ధి చెందిన దేశాలకు సాధ్యం కానిది భారత్ ఘనతకు గుర్తుకుగా ఏటా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవం నిర్వహిస్తున్నామని తెలిపారు. కెనరాబ్యాంకు అసిస్టెంటు జనరల్ మేనేజరు కె.మురళీమోహన్, భౌతికశాస్త్ర అధ్యాపకుడు ఫణీంద్రారెడ్డి, ఇన్‌ఛార్జ్ రిజిస్ట్రారు రాజేశ్‌కుమార్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు

సంబేపల్లె, ఆగస్టు23: అంతరిక్ష పరిశోధనలతో జీవన ప్రయోజనాలు మెరుగువుతున్నాయని జిల్లా సైన్స్ అధికారి మార్ల ఓబుల్‌రెడ్డి అన్నారు. స్థానిక జడ్పీహైస్కూల్‌లో నిర్వహించిన జాతీయ అంతరిక్ష దినోత్సవాల్లో ఆయన మాట్లాడుతూ చంద్రయాన్, ఆదిత్య వంటి అంతరిక్ష విజయాల ద్వారా ఇస్రో మానవ ప్రయోజనాలను మెరుగు పరుస్తోందన్నారు. భారత్ ఆన్ ది మూన్ డిజిటల్ లైబ్రరీ ద్వారా అంతరిక్ష ప్రయోగాల సమాచారాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు అధ్యయనం చేశారన్నారు. ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం

8 మంది స్మగ్లర్లు అరెస్టు


రైల్వేకోడూరు(రూరల్) ఆగస్టు 23: బాలపల్లె అటవీ ప్రాంతం, తిరుపతి జిల్లా చంద్రగిరి అటవీ ప్రాంతంలో నిర్వహించిన దాడుల్లో 33 ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకుని 8 మంది స్మగ్లర్లను అరెస్టు చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఎస్పీ కే.శ్రీనివాస్ తెలిపారు. అన్నమయ్య జిల్లా బాలపల్లె, భాకరాపేట అటవీ ప్రాంతంలో ఆర్ఐ కృపానంద, ఆర్ఎస్ఐ అలీబాషా టీమ్ సిద్దలేరు నుంచి కూంబింగ్ నిర్వహిస్తుండగా కొందరు అక్రమంగా ఎర్రచందనం దుంగలను మోసుకువస్తూ కనిపించారు వారిపై దాడి చేసి ఆరుగురు తమిళనాడు వాసులను అరెస్టు చేసి 25 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. తిరుపతి జిల్లా చంద్రగిరి అటవీ ప్రాంతాల్లో ఆర్ఐ కే.సురేష్‌రెడ్డి, ఆర్ఎస్ఐ లింగాధర్ టీమ్ కూంబింగ్‌లో భాగంగా కారులో అక్రమంగా తరలిస్తున్న 7 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని విచారించి రైల్వే బ్రిడ్జి కింద ఒక ఎర్రచందనం దుంగను స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు తమిళనాడు వాసులను అరెస్టు చేసినట్లు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీస్ సిబ్బంది తెలిపారు.

స్టాంప్‌రైటర్లే లంచాలు వసూళ్ళు చేస్తున్నారు

డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు

ప్రొద్దుటూరు ఆగస్టు 23: సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులకు లంచాలు వసూలు చేస్తున్నదంతా స్టాంప్ రైటర్లేనని డిస్ట్రిక్ రిజిస్ట్రార్ బాబుకు కొందరు బాధితులు ఫిర్యాదు చేశారు. శుక్రవారం ప్రొద్దుటూరు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు జిల్లా రిజిస్ట్రార్ బాబు తనిఖీ నిమిత్తం వచ్చారు. ప్రొద్దుటూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు కొందరు స్టాంప్ రైటర్ల ద్వారా లంచాలు తీసుకుంటున్నారన్నారు. స్టాంప్‌రైటర్ అజీజ్‌ను ఒక భూమి రిజిస్ట్రేషన్ విషయమై సంప్రదించగా సబ్ రిజిస్ట్రార్‌కు ఆఫీసు స్టాఫ్‌కు లంచాలు ఇవ్వాలని ఆ ఫీజు రూ.25 వేలు అవుతుందని తెలిపారని ఇందుకు తమ వద్ద సాక్ష్యాలు వున్నాయని లిఖిత పూర్వక ఫిర్యాదు అందజేశారు.

33 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం

ప్రొద్దుటూరు అర్బన్, ఆగస్టు 23: ఇంట్లో అక్రమంగా నిల్వఉంచిన 33క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్ ఆర్ఐ ప్రసాద్, వీఆర్ఓ రామచంద్రారెడ్డి తనిఖీ చేసి పట్టుకున్నారు. శుక్రవారం రాత్రి ఇంటి యజమాని రామక్రిష్ణను విచారించగా ఎండీయూ ఆపరేటర్ నుంచి కొనుగోలు చేశానన్నారు. పశువులకు పోషణ నిమిత్తం ఉంచుకున్నానని ఆయన తెలిపారు. బియ్యం స్వాధీనం చేసుకుని 4వ వార్డు రేషన్ డీలర్‌కు అధికారులు అప్పగించారు. కేసు నమోదు చేసి నివేదిక జేసీకి పంపనున్నట్లు తెలిపారు.

ముగ్గురు మట్కా బీటర్లు అరెస్టు

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 23: వాస్తు కాంప్లెక్సు వద్ద ముగ్గురు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు టుటౌన్ సీఐ యుగంధర్ తెలిపారు. మట్కా ఆడుతున్న మైఖేల్, గన్నా, చాంద్‌బాషను అరెస్టు చేసి వారి నుంచి 60000లు నగదు, స్లిప్పులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

నేటి నుంచి అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు

కడప (స్పోర్ట్స్) ఆగస్టు 23: నేటి నుంచి కడపలో సౌత్‌జోన్ అండర్-23 మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి అవ్వారు రెడ్డి ప్రసాద్ తెలిపారు. ఏసీఏ క్రికెట్ మైదానం, కేఎస్ఆర్ఎం, కేఓఆర్ఎం మైదానాల్లో శనివారం నుంచి సెప్టెంబర్ 11 వరకూ ఏసీఏ సౌత్‌జోన్ అండర్- 23 మెన్స్ మల్టీడే క్రికెట్ మ్యాచ్‌లు జరుగనున్నట్లు తెలిపారు. ఈమ్యాచ్‌లలో కడప, కర్నూలు, నెల్లూరు, చిత్తూరు, అనంతపురం, తదితర జట్లు పాల్గొంటున్నట్లు వెల్లడించారు.

పల్లె ప్రగతికి బాటలు వేద్దాం: ఎమ్మెల్యే



గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి... సింహాద్రిపురం గ్రామ సభలో మాట్లాడుతున్న మండల టీడీపీ ఇన్‌చార్జ్ మారెడ్డి జోగిరెడ్డి

వల్లూరు, ఆగస్టు 23 : గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులతో కలిసి అధికారులు పోటీ పడాలని ఎమ్మెల్యే క్రిష్ణచైతన్యరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే మండల కేంద్రమైన వల్లూరులో జరుగుతున్న గ్రామసభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ ఇక్కడికి వచ్చిన ప్రతి ఒక్కరూ గ్రామం అభివృద్ధి చెందేలా ప్రణాళికలు రూపొందించుకుని పోటీ పడాలన్నారు. గ్రామంలోని ప్రతివీధిలో సిమెంటు రోడ్లు, తాగునీరు వీధిదీపాలు తదితర అంశాలను తెలుసుకోవాలన్నారు. గాంధీజీ కలలుగన్న పల్లె కలను సాకారం చేయాలన్నారు.వల్లూరు గ్రామానికి పూర్వవైబవం వచ్చేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. వల్లూరును ఏపీలోనే మేటి గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దాలన్నారు. అభివృద్ధి ప్రణాళికల్లో అధికారులతో కలిసి తాను కూడా పాలుపంచుకుంటానన్నారు. నిధుల కోసం జిల్లాస్థాయి అధికారులతో మా ట్లాడుతామన్నారు.అనంతరం గ్రామ సచివాలయ పరిధిలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. స్థానిక గ్రామ సచివాలయ సిబ్బందితో మాట్లాడారు. కార్యక్రమంలో తహ సీల్దారు శ్రీవాణి, ఎంపీడీఓ జయశ్రీ, వల్లూరు మండల టీడీపీ అధ్యక్షుడు నాగేశ్వర్‌రెడ్డి గ్రామ సచివాలయ సిబ్బంది, ఏపీడీ, స్థానిక ఉపాధి అధికారులు పాల్గొన్నారు. అలాగే గోటూరు చెరువుకు సం బంధించిన కాల్వ పనులను స్థానికులు ఆయనకు చూపించారు.

గ్రామాల అభివృద్ధికి కృషిచేయాలి: ఎమ్మెల్యే

పెండ్లిమర్రి, ఆగస్టు 23: గ్రామాల అభివృద్ధికి అధికారులు, ప్రజా ప్రతినిధులు సమష్టిగా కృషిచేయాలని ఎమ్మెల్యే పు త్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన పెండ్లిమర్రి సచివాలయంలో శుక్రవారం మన పంచాయతీ మన సాధికారత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన గ్రామసభకు ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. తహసీల్దార్ అనురాధ, ఎంపీడీఓ జగన్‌మోహన్‌రెడ్డి, సర్పంచులు ఎస్వీ గంగిరెడ్డి, నాగముల్లారెడ్డి పాల్గొన్నారు.

పల్లె ప్రగతే ప్రభుత్వ ధ్యేయం

సీకేదిన్నె, ఆగస్టు 23: పల్లె ప్రగతే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి అన్నారు. చింతకొమ్మదిన్నె గ్రామ సచివాలయం వద్ద సర్పంచ్ మహేశ్వరి ఆధ్వర్యంలో జరిగిన గ్రామసభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో అభివృద్ధి లేక ప్రజలు అష్టకష్టాలు పడ్డారని, ఆ కష్టాలు తీర్చేందుకు కూటమి ప్రభుత్వంలో కృషి చేస్తున్నామన్నారు. డ్వామా పీడీ విజయకుమార్, ఈఈ రామచంద్రారెడ్డి, తహసీల్దారు నాగేశ్వరరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీధర్, టీడీపీ నాయకులు టక్కోలి క్రిష్టారెడ్డి, వీరూప్రసాద్, రాజా, మహేశ్వర్ రెడ్డి, నజీర్, ధర్మారెడ్డి, దస్తగిరి, మాధవరెడ్డి, సుబాన్, గఫూర్, గోవిందు పాల్గొన్నారు.

గ్రామసభలతో పంచాయతీల అభివృద్ధి: ఈఓపీఆర్డీ

చెన్నూరు, ఆగస్టు 23 : గ్రామ పంచాయతీల అభివృద్ధికి గ్రామసభలే మూలమని ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు అన్నా రు. శుక్రవారం చెన్నూరుతో పాటు మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. చె న్నూరు గ్రామసభలో ఈఓపీఆర్డీ మాట్లాడుతూ చెన్నూరు గ్రామసభకు సంబంధించి రూ.3.21 కోట్ల విలువైన పను లు గుర్తించామన్నారు. ఇందులో సిమెంటు రోడ్లు, మురు గు కాల్వల నిర్మాణం, లింకురోడ్లు తదితరాలు ఉన్నాయన్నారు. రోడ్లు బాగుంటే ఆ ఊరు అభివృద్ధి పథంలో ఉన్నట్టు లెక్క అన్నారు. డీఎల్‌పీఓ మస్తాన్‌వలి, డీఎల్‌డీఓ వెంకటసుబ్బయ్య, ఎంపీడీఓ సుదర్శనశర్మ మాట్లాడుతూ చెన్నూరులో దాదాపు రూ.4కోట్లకు పైగా పనులు చేపడుతున్నట్లు తెలిపారు. పంచాయతీ సర్పంచ్ వెంకటసుబ్బయ్య, టీడీపీ మండల కన్వీనరు విజయభాస్కర్‌రెడ్డి, వైసీపీ కన్వీనరు జీఎన్‌భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేశ్‌యాదవ్, కార్యదర్శి రామసుబ్బారెడ్డి, తహసీల్దరు జీవన్‌చంద్రశేఖర్, వ్యవసాయాధికారి శ్రీదేవి పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేయండి

వేంపల్లె, ఆగస్టు 23: అభివృద్ధి పనులు ప్రణాళికాబద్దంగా చేపట్టాలని టీడీపీ మండల కన్వీనర్ మునిరెడ్డి, మైనార్టీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షబ్బీర్, మైనార్టీ కన్వీనర్ వల్లి, మండల ఉపాధ్యక్షుడు భద్ర అధికారులకు, ప్రజాప్రతినిధులకు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ సభాభవనంలో వేంపల్లె మేజర్ గ్రామ పంచాయతీ గ్రామసభ సర్పంచు ఆర్ శ్రీను ఆధ్వర్యంలో జరిగింది. ప్రత్యేకాధికారి పీఆర్ ఏఈ శ్రీనివాసులు, ఏపీఓ పార్వతి తదితర అధికారులు పాల్గొన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా రూ.1.44కోట్లు మంజూరయ్యాయని, ఆయా పనులు ప్రభుత్వ సూచన మేరకు ప్రాధాన్యతాక్రమంలో చేపడుతామన్నారు.

గ్రామ సభల ద్వారా గ్రామాల అభివృద్ధి

సింహాద్రిపురం, ఆగస్టు 23: గ్రామ సభల ద్వారా సమస్యల పరిష్కారంతో పాటు గ్రామాలు అభివృద్ధి చెందడం ఖా యమని మారెడ్డి రవీంద్రనాథరెడ్డి(బీటెక్ రవి) సోదరుడు, టీడీపీ మండల ఇన్‌చార్జ్ మారెడ్డి జోగిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయ సభాభవనంలో ఎంపీడీఓ కృష్ణమూర్తి ఆధ్వర్యంలో జరిగిన గ్రామ సభలో జోగిరెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వంలో సింహాద్రిపురంలో అర్థాంతరంగా ఆగిపోయిన డ్రైనేజ్, సీసీ రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ఎన్‌ఆర్‌జీఎస్ కిం ద నిధులు కేటాయించి పనులు పూర్తి చేయడం, చీనీ తో టల సాగుకు, పశువుల షెడ్ల నిర్మాణాలకు ఆర్థిక సా యం, మండల కాంప్లెక్స్‌లో పిచ్చిమొక్కలు తొలగించి పూల మొక్కలు పెంచి సుందరీకరణ తదితర పనులు చేపట్టాలన్నారు. హిమకుంట్ల పంచాయతీలో జరిగిన గ్రామ సభలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషన్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు, ఉపాధి ఏపీఓ జయభారతి పాల్గొన్నారు.

గ్రామసభలతోనే గ్రామాభివృద్ధి

వేముల, ఆగస్టు 23: గ్రామ సభల ద్వారా ప్రజల సహకారంతో ప్రజల సమన్వయంతో సమస్యలను ఎంచుకొని ప్ర భుత్వానికి తెలపడం ద్వారా గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేర్ల పార్థసారధిరెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో శుక్రవారం మండల వ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభలలో మండల కేంద్రమైన వేముల గ్రామసభలలో పాల్గొన్న పేర్ల పార్థసారధిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన విధానానికి ఈ గ్రామసభలే నిదర్శనమన్నారు. అనంతరం గ్రామంలో చేపట్టాల్సిన పనులను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆ వ్యాపారులను ప్రజల సమక్షంలో తీర్మాణంచేసి ప్రభుత్వానికి పంపారు. ఈ కార్యక్రమంలో సర్పంచు రామాంజనమ్మ, పంచాయతీ సెక్రటరీ సులోచన, ఐసీడీఎస్ సూపర్వైజర్ హసీన, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధికి చిరునామాగా పంచాయతీలు : బీటెక్ రవి


తొండూరులో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల రూరల్, ఆగస్టు 23: గ్రామ పంచాయతీలు అభివృద్ధికి చిరునామాగా మారనున్నాయని జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బీటెక్ రవి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన తొండూరులో నిర్వహించిన మన పంచాయతీ మన సాధికార గ్రామసభ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా బీటెక్ రవి మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్నినిర్వీర్యం చేసిందన్నారు. దీనితో గ్రామాల అభివృద్ధి కనిపించకుండా పోయిందన్నారు. మౌలిక వసతులు కల్పించలేని దుస్థితి వైసీపీ పాలనలో ఉండేదన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనించేందుకు అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు. నీటి సంరక్షణ, మౌలిక సదుపాయాల కల్పన, వ్యవసాయ అనుబంధ పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటి నీరుపోశారు. ముందుగా అదితిసింగ్ ఆలయం లో పూజలు నిర్వహించారు. గ్రామసభ వేదిక వద్దకు వచ్చే మార్గంలో జేసీకి పూలవర్షం కురిపించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ ఏపీఓ లావణ్య, సెక్రటరీ సాయి, ఎంపీడీఓ, తహసీల్దార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా గ్రామసభలు


పులివెందుల: మాట్లాడుతున్న ఎంపీడీఓ వెంకటేశ్

పులివెందుల రూరల్/లింగాల, ఆగస్టు 23: పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు పులివెందుల ఎంపీడీఓ వెంకటేశ్, లింగాల ఎంపీడీఓ లోకేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం పులివెందుల మండలంలోని ఆరు పంచాయతీలు, లింగాల మండలంలోని 19 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.

పంచాయతీలను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం


మాట్లాడుతున్న పుత్తా నరసంహారెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 23 : మండలంలోని ప్రతి పంచాయతీని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి తెలిపారు. శుక్రవారం దేవరాజుపల్లె పంచాయతీలో సర్పంచ్ రామలక్ష్మి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. వారు మాట్లాడుతూ ప్రతి పని పూర్తి చేసి ఆదర్శంగా మారుస్తామన్నారు.


చెన్నూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ సురేశ్‌బాబు


వేంపల్లె: సర్పంచు ఆర్.శ్రీను, అధికారులకు వినతిపత్రం ఇస్తున్న మునిరెడ్డి, షబ్బీర్ తదితరులు

జేఎన్టీయూ బీటెక్ ఫలితాలు విడుదల

పులివెందుల రూరల్, ఆగస్టు 23: పులివెందుల జేఎన్టీయూ కళాశాల బీటెక్ మొదటి సంవత్సరం రెండవ సెమిస్టర్ (ఆర్23) రెగ్యులర్ పరీక్ష ఫలితాలు విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అరుణకాంతి తెలిపారు. శుక్రవారం స్థానిక జేఎన్టీయూ కళాశాల కార్యాలయంలో జూలై/ఆగస్టు-2024నెలలో నిర్వహించిన పరీక్ష ఫలితాలు విడుదల చేసి వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ మరియు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ సూర్యనారాయణరెడ్డి, పరీక్ష విభాగాధిపతులు డాక్టర్ ఎస్ హుస్సేన్ వలి, డాక్టర్ సాంబయ్య, తదితర అధ్యాపకులు పాల్గొన్నారు.

గండి అంజన్న ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

చక్రాయపేట, ఆగస్టు 23: గండి ఉత్సవాలలో భాగంగా మూడవ శనివారంలో రానున్న భక్తులను దృష్టిలో పెట్టుకొని అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య తెలిపారు. క్యూలైన్లు, చలువపందిళ్లు, లడ్డు ప్రసాదాలు, పులిహోర అందుబాటులోకి తెచ్చామన్నారు. 30వేల లడ్డు ప్రసాదాలు ఏర్పాటుచేశామన్నారు. అలాగే సీఐ నాగరాజు ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 285మంది పోలీసులు, ఆరుమంది ఎస్‌ఐలు, నలుగురు సీఐలు, హోంగార్డులు భారీగాఏర్పాటుచేశారు. గండిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూడడానికివేంపల్లె ఎస్‌ఐ రంగారావు, ట్రిపుల్‌ఐటీ ఎస్‌ఐ భాస్కర్ రెడ్డి తదితర సిబ్బందికి సీఐ సూచనలు ఇచ్చారు.

యూనివర్శిటీ అధ్యాపకులకు ఎంటీఎస్ అమలు చేయాలి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : వైవీయులో అకడమిక్ కన్సల్టెంట్, గెస్ట్‌ఫ్యాకల్టీల ఎంటీఎస్ అమలు చేయాలని అకడమిక్ కన్సల్టెంట్లు కోరారు. శుక్రవారం కమలాపురం ఎమ్మెల్యే పుత్తా క్రిష్ణచైతన్యరెడ్డిని కలిసి సమస్యలు విన్నవించారు.అనంతరం వారు మాట్లాడుతూ పీజీ, సెట్, నెట్ పీహెచ్‌డి అర్హత కలిగి అతి తక్కువ వేతనాలతో యూనివర్శిటీలో పనిచేస్తున్న తమకు మినిమం టైం స్కేల్ అమలు చేసేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ మీ సమస్యను రాష్ట్ర విద్యామంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళతామని అసెంబ్లీలో కూడా ప్రస్తావిస్తానని హామీ ఇచ్చారు. వైవీయు కన్సల్టెంట్ అకడమిక్ ప్రతినిధులు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని బీఎల్‌ఓల వినతి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : గత నాలుగు సంవత్సరాలుగా వేతనాలు ఇవ్వలేదని, వెంటనే చెల్లించాలని బీఎల్‌ఓల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీరయ్య, సాగర్ డిమాండ్ చేశారు. శుక్రవారం కార్పొరేషన్ సమావేశ మందిరంలో కడప తహసీల్దారు నారాయణరెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ కడప కార్పొరేషన్ పరిధిలో 268 పోలీసుస్టేషన్లకు వార్డు సచివాలయ సిబ్బంది అయిన తాము బీఎల్‌ఓలుగా గత నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్నామన్నారు. అప్పటి నుంచి ఎటువంటి గౌరవ వేతనం ఇవ్వలేదన్నారు. తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ సెక్రటరీల యూనియన్ సంఘం ప్రతినిధులు నవీన్, వాణి, భ్రమరాంబిక, లక్ష్మిదేవి, మస్తాన్, హనుమాన్‌నాయక్, శివతో పాటు అధిక సంఖ్యలో సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉన్నత శిఖాలు చేరుకోవాలి

వల్లూరు, ఆగస్టు 23 : బాలికలు తమ ఉపాధ్యాయులు చెప్పిన రీతిలో చదువుకుని ఉన్నత శిఖాలు అధిరోహించాలని వల్లూరు మండల ఐసీడీఎస్ సూపర్‌వైజరు రాసమ్మ అన్నారు. శుక్రవారం స్థానిక కస్తూర్బా పాఠశాలలో బాలికల సంరక్షణ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు.

'వంకపోరంబోకు స్థల ఆక్రమణను అరికట్టాలి'

కడప (నాగరాజుపేట), ఆగస్టు 23 : కడప నగరం చిన్నచౌకులో వంక పోరంబోకు స్థలం ఆక్రమణకు గురైందని ఆ స్థలాన్ని ఆక్రమించిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సర్వే నెం.247/2లోని ఆక్రమిత స్థలాన్ని అఖిలపక్ష నాయకులు నారాయణరెడ్డి, కిశోర్‌కుమార్, సత్తార్, సీఆర్వీ ప్రసాద్, ఆంజనేయులు పరిశీలించారు. అధికారులు స్పందించి రియల్ ఎస్టేట్ వ్యాపారుల ఆక్రమణలో ఉన్న వంకపోరంబోకు స్థలాన్ని స్వాధీ నం చేసుకుని పేదలకు ఇవ్వాలన్నారు.

వసతి గృహం ఏర్పాటు అభినందనీయం

● ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్యరెడ్డి


వీరపునాయునిపల్లెలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

వీరపునాయునిపల్లె, ఆగస్టు 23: సొంత ఖర్చు ఖర్చులతో నిరుపేద విద్యార్థినిలకు చక్కగా విద్యను అందించడం కోసం వసతి గృహం ఏర్పాటు అభినందనీయమని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యకుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన వీరపునాయునిపల్లెలో సంగమేశ్వర ఉన్నతపాఠశాల ప్రాంగణంలో నూతనంగా బీసీ బాలికల వసతి గృహాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత పదిహేను ఏళ్లుగా నిరుపేద విద్యార్థినిలకు చక్కటి విద్యను అందించాలనే దృఢసంకల్పంతో సగమేశ్వర ఉన్నత ఆపఠశాల కరస్పాండెంట్ వెంకటసుబ్బానాయుడు ఎంతో కృషి చేశారన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. తల్లిదండ్రులు గర్వపడేలా చూడాల్సిన బాధ్యత మీపై ఉందన్నారు. ప్రతి ఒక్కరు ఉపాధ్యాయులు బోధించిన విద్యను చక్కగా తల్లిదండ్రులుపాఠశాలకు మంచిపేరు తీసుకురావాలన్నారు. అందరు ఎదగాలని పిల్లలకుగుర్తుచేశారు. ముందుకు ఎమ్మెల్యేకు పూల వర్షంకురిపించి ఘనస్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో సంగమేశ్వర విద్యాసంస్థ అధినేత వీవీ సుబ్బానాయుడు, ఎంఈఓ జాఫర్ సాదిక్, బీసీ వెల్ఫేర్ అధికారి భరత్‌కుమార్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు సుబాషిణి, వీఆర్ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సుధీర్, మండల టీడీపీ కన్వీనర్ విజయభాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రసాదరెడ్డి, ఎస్‌వీఆర్‌ఎస్‌ఎం బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

పెండ్లిమర్రి, ఆగస్టు 23: కాలానికి అనుగుణంగా విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించి ప్రతిభను చాటాలని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్జేడీ రవి, కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, సర్పంచునాగముల్లారెడ్డి, విద్యార్థినీ, విద్యార్థులుపాల్గొన్నారు.

వైవీయూ ఇన్‌చార్జ్ వీసీ క్రిష్ణారెడ్డిని తొలగించాలి

● ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకుల డిమాండ్


వైవీయూ గేటు వద్ద ధర్నాచేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : అనైతిక కార్యకలాపాలకు పాల్పడిన వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు క్రిష్ణారెడ్డిని తొలగించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి గంగా సురేశ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి గుజ్జుల వలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం వైవీయూ ముట్టడి కార్యక్రమం చేపట్టారు. యూనివర్శిటీలో ఉన్న అన్ని గేట్లకు తాళాలు వేసి విద్యార్థులు లోపలికి పోనివ్వకుండా అడ్డుకున్నారు. వైవీయూ వేమన విగ్రహం ఎదుట ప్రధాన గేటును ముట్టడించారు. అనంతరం వారు మాట్లాడుతూ అనైతిక కార్యకలాపాలకు, లైంగిక వేధింపులకు పాల్పడిన వారు ఉన్నత పదవుల్లో ఉండడం క్షమించరాని నేరమన్నారు. ప్రొఫెసరు క్రిష్ణారెడ్డి గత ప్రభుత్వ అండదండలతో క్రిష్ణా యూనివర్సిటీ రిజిస్ట్రారుగా ఉన్నప్పుడు అవినీతి అక్రమాలు, అనైతిక కార్యకలాపాలకు పాల్పడ్డారన్నారు. దీనిపై ఏసీబీ విచారణ కూడా చేశారన్నారు. వైవీయూ ప్రిన్సిపాల్‌గా ఉన్నప్పుడు కొంతమంది మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించారన్నారు. కాల్‌రికార్డ్స్, ఆడియోపై ఫోరెన్సిక్‌లో పరీక్షలు నిర్వహించడానికి తాము సిద్ధమన్నారు. క్రిష్ణారెడ్డి తక్షణం రాజీనామా చేసి పదవి నుంచి వైదొలగాలని లేకుంటే పోరాటం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శివశంకర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగార్జున, నాయకులు అరుణ్, తేజా, అకిరానంద్, చంద్ర పాల్గొన్నారు.

ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలి: ఏఐఎస్‌యూ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : జిల్లాలో ఫిట్‌నెస్ లేకుండా తిరుగుతున్న స్కూలు, కళాశాల బస్సులను వెంటనే సీజ్ చేయాలని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు జగదీశ్, రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా ఉప రవాణ కమిషనరు మీరాప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలో అనేక కార్పొరేట్, ప్రైవేట్ విద్యాసంస్థల నిర్వాహకులు ఆయా కళాశాలల బస్సుల్లో ఫిట్‌నెస్, ఎఫ్‌సీ, ఇన్సూరెన్స్ లేకపోయినా విద్యార్థులను తరలిస్తున్నారన్నారు. తర్ఫీదు లేని డ్రైవర్లతో బస్సులు నడపటం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. అలాగే సామర్థ్యానికి మించి విద్యార్థులతో నడుపుతున్నారన్నారు. దీనిపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు.

'సీపీఎస్ బాధితుల సభను విజయవంతం చేయండి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : సీపీఎస్ పథకంలో ఉన్న లోటుపాట్లను ప్రభుత్వానికి తెలిపేందకు సెప్టెంబరు 1న విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించనున్న సీపీఎస్ బాధితుల సభను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్థనరెడ్డి, కార్యదర్శి కొండారెడ్డి శుక్రవారం ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సీపీఎస్ పథకంలో ఉండి పదవీ విరమణ పొందిన ఉద్యోగులు, మరణించిన వారి కుటుంబ సభ్యులతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగుల సమాఖ్య నాయకులు, వివిధ ఎమ్మెల్సీలు హాజరుకానున్నారన్నారు.

పవన్ కళ్యాణ్‌కు ఘనస్వాగతం


పవన్‌కళ్యాణ్‌కు స్వాగతం పలుకుతున్న సుంకర శ్రీనివాస్

రైల్వేకోడూరు, ఆగస్టు 23: మండలంలోని మైసూరివారిపల్లెలో నిర్వహించిన గ్రామ సభకు శుక్రవారం వచ్చిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కు జనసేన ఉమ్మడి కడప జిల్లా కో-ఆర్డినేటర్ కడప నియోజకవర్గ ఇన్‌చార్జ్ సుంకర శ్రీనివాస్ ఘన స్వాగతం పలికారు. కడప నగర సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

మట్కా, గుట్కా, డ్రగ్స్‌పై చర్యలు తీసుకోవాలి

● డీఐజీని కోరిన టీడీపీ నాయకుడు గోవర్ధనరెడ్డి


డీఐజీని సత్కరిస్తున్న గోవర్ధనరెడ్డి

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 23 : జిల్లాలో మట్కా, పేకాట, ఆన్‌లైన్ గేమ్‌లు, క్రికెట్ బెట్టిగ్‌లు, గుట్కా, గంజాయి అమ్మకాలపై చర్యలు తీసుకోవాలని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధనరెడ్డి కోరారు. శుక్రవారం కర్నూలులో డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్‌ను కలిసి వినతి పత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో మాదకద్రవ్యాల వాడకం ఎక్కువైందన్నారు. యువత పెడదారి పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తద్వారా చాలా కుటుంబాలు నాశనం అవుతున్నాయన్నారు. హింసాత్మక ఘటనలు రోజురోజుకూ పెరుగుతున్నాయని, వాటిపై దృష్టి సారించిప ప్రత్యేక నిఘా బృందం ఏర్పాటు చేసి వాటిపై ఉక్కుపాదం మోపాలని ఈ సందర్భంగా కోరారు.

నలుగురిపై చీటింగ్ కేసు నమోదు

కడప (క్రైం), ఆగస్టు 23 : కడప నగరం చెమ్ముమియ్యాపేటలో ప్రైవేటు చీటీలు వేసి జనాన్ని మోసం చేసిన నలుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు కడప తాలుకా సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వివరాల మేరకు చెమ్ముమియ్యాపేటకు చెందిన ప్రతాప్‌రెడ్డి అతని భార్య గంగాభవాని మరో ఇరువురు పిల్లల తో కలిసి చీటీల వ్యాపారం నిర్వహిస్తున్నారు. అదే ప్రాంతానికి చెందిన లక్ష్మిదేవి మరికొంత మందికి చీటీలు పూర్తయ్యాక డబ్బు ఇవ్వకుండా మోసం చేయడంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

అర్బన్ సీఐగా జీవన్ గంగానాథ్‌బాబు




పులివెందుల టౌన్, ఆగస్టు 23: పులివెందుల అర్బన్ సీఐగా జీవన్ గంగానాథ్‌బాబు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. ఆయనకు పోలీస్‌స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

అమ్మవారికి ప్రత్యేకపూజలు

వేంపల్లె, ఆగస్టు 23: శ్రావణ శుక్రవారం సందర్భంగా అమ్మవారిశాలలోని వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం మూడవ శుక్రవారం పురస్కరించుకొని ఆలయపూజారి ఇంద్రకంటి ప్రసాదశర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. 108అష్టోత్తర శత నామావళి పూజలు నిర్వహించారు. ఆర్య వైశ్యమహిళా మండలి అధ్యక్షులు ప్రవీణ, ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి, సంధ్యారాణి తదితరులు ఈ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రత్యేకంగా అలంకరించిన అమ్మవారిని దర్శించుకొని పూజలుచేశారు. ప్రాకారోత్సవ పూజలు చేశారు.

ప్రాథమిక విద్యకు పాడె కట్టిన వైసీపీ

● ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి


లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, శ్రీనివాసరెడ్డి

కడప (మారుతీనగర్), ఆగస్టు 23: నూతన జాతీయ విద్యావిధానం 2020 సాకుతో వైసీపీ పాలనలో ప్రాథమిక విద్యకు పాడె కట్టారని ఎమ్మెల్యే మాధవి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం ఆర్ఎస్‌యూ నేత రవిశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జాతీయ మహాసభల లోగోను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఓ నెంబర్ 117ను జారీ చేసి 3, 4, 5, తరగతులను సమీప ఉన్నత పాఠశాలలో విలీనం చేయడం వల్ల రాష్ట్రంలో వేలాది ప్రాథమిక పాఠశాలలు మూసివేతకు గురయ్యాయన్నారు. దీంతో వేలాది ఉపాధ్యాయ పోస్టులు రద్దయ్యాయన్నారు. సెప్టెంబర్ 13,14,15 తేదీలలో తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో జరుప తలపెట్టిన ఆర్ఎస్‌యూ ప్రథమ జాతీయ మహాసభలను విజయవంతం చేయాలన్నారు.

కృష్ణాష్టమి వేడుకలను జయప్రదం చేయండి: పుత్తా నరసింహారెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 23 : నగర పంచాయతీలోని రైల్వేగేటు వద్ద గల రాధాక్రిష్ణమందిరంలో 26న జరగబోయే శ్రీకృష్ణజన్మాష్టమి 8వ వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డి కోరారు. శుక్రవారం రాధాక్రిష్ణ ఆలయంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాధాక్రిష్ణ ఆలయాన్ని ప్రారంభించి 8 ఏళ్లు పూర్తవుతోందన్నారు. ఉదయం పూజలు, ఎద్దుల బండలాగుడు పోటీలు ఉంటాయన్నారు. మ ధ్యాహ్నం రాధాక్రిష్ణ ఆలయం సమీపంలో అన్నదానం ఉంటుందన్నారు. బండలాగుడు పోటీల్లో బహుమతులు వరుసగా మొదటి రూ.40వేలు, 30వేలు, 20వేలు, పదివేలు, 5వేలు అందించనున్నట్లు తెలిపారు. ముగ్గుల పోటీలు కూడా ఉంటుందన్నారు. అందులో కూడా రూ.4వేలు, 3వేలు, 2వేలు, వెయ్యి బహుమతులు అందించనున్నట్లు తెలిపారు. అదేరోజు ఉట్టికొట్టే కార్యక్రమం ఉంటుందన్నారు.

లాభాల బాటలో ప్రొద్దుటూరు టౌన్‌బ్యాంకు

● అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి

ప్రొద్దుటూరు,ఆగస్టు 23 : ప్రొద్దుటూరు కో-ఆపరేటివ్ టౌన్ బ్యాంకు వరుసగా లాభాల బాటలో పయనిస్తోందని అధ్యక్షుడు బొగ్గుల వెంకట సుబ్బారెడ్డి వెల్లడించారు. శుక్రవారం స్థానిక కోనేటికాల్వ వీధిలోని ప్రొద్దుటూరు కో ఆపరేటివ్ టౌన్ బ్యాంకు 103 వవార్షిక సర్వసభ్య సమావేశం అధ్యక్షుడు వెంకట సుబ్బారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023-2024 ఆర్థిక సంవత్సరానికి బ్యాంకుకు 1.73 కోట్ల ఆదాయం వచ్చిందన్నారు. బ్యాంకులోని షేర్ హోల్డర్లకు 12 శాతం లాభాల్లో వాటా ఇచ్చామన్నారు. ఆర్‌బీఐ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తూ ఆడిట్‌లో ఏ-గ్రేడ్ సాధించిందన్నారు. దాదాపు 75 కోట్ల డిపాజిట్లు కలిగి 55 కోట్ల రుణాలు ఇచ్చామన్నారు. ప్రతిరోజూ రిజర్వ్ బ్యాంకు అబ్జర్వేషన్ వుంటుందన్నారు. 8.40 కోట్ల సొంత నిధులు బ్యాంకులో వున్నాయన్నారు .కార్యక్రమంలో బ్యాంకు సీఈవో నిరంజన్‌రెడ్డి, డైరెక్టర్లువెల్లాల కుమార్‌రెడ్డి కిశోర్‌కుమార్,ఖలీల్ ,రాంభూపాల్‌రెడ్డి,గోదిన గంగాధర్, పిసురేష్, చెన్న కేశవరెడ్డి, ఎల్‌వీ రమణారెడి, సురేంద్రనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగు వేతనాలు ఇవ్వాలి

పోరుమామిళ్ల, ఆగస్టు 23 : గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛభారత్ కార్మికులుగా సేవలందిస్తున్న వారికి పెండింగులో ఉన్న 26 నెలల జీతాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పిడుగు మస్తాన్, సీపీఐ మండల కార్యదర్శి రవికుమార్ తదితరులు ఎంపీడీవో వరప్రసాద్‌రావు, సర్పంచ్ యనమల సుధాకర్, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, ఈఈవో వెంకటసుబ్బయ్య తదితరులకు వినతిపత్రం అందించారు. శుక్రవారం పోరుమామిళ్లలో జరిగిన గ్రామసభలో వారు మాట్లాడుతూ కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మున్సిపల్ కమిషనర్‌గా వాకమల్ల వెంకట నరసింహారెడ్డి



బద్వేలుటౌన్, ఆగస్టు 23 : బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా వాకమల్ల వెంకటనరసింహారెడ్డి శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా చిత్తూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలో పనిచేస్తున్న ఈయనను బద్వేలు మున్సిపల్ కమిషనర్‌గా నియమించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ కౌన్సిల్ సభ్యులు, మున్సిపల్ సిబ్బంది సహకారంతో పట్టణంలో పారిశుధ్య సమస్య పరిస్కారానికి, మౌలిక వసతుల కల్పనకు కృషిచేస్తానని ఆయన అన్నారు.

ప్రొద్దుటూరు ట్రాఫిక్ సీఐగా దేవ కిరణ్‌కుమార్



ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 23 : ప్రొద్దుటూరు ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సి.దేవకిరణ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన 1998లో ఎస్‌ఐగా బాధ్యతలు చేపట్టారు. కాగా ప్రస్తుతం ట్రాఫిక్ సీఐగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని, తరచూ తమ సిబ్బందితో వాహనాల తనిఖీ చేపడతామన్నారు.

వసతి గృహంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోండి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 23: పొట్టిపాడు రోడ్డులోని సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహం-2లో ఖాళీలు ఉన్నాయని, ఆసక్తి ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వసతి గృహ సంక్షేమ అధికారి ఎ.రామక్రిష్ణారెడ్డి తెలిపారు. 62 సీట్లు ఖాళీగా ఉన్నాయని, 3 నుంచి 10వ తరగతి చదివే ఎస్సీ విద్యార్థులు హాస్టల్‌లో చేరాలని కోరారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు విద్యార్థి తల్లిదండ్రుల ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్, జిరాక్స్ కాపీ, విద్యార్థి పాస్‌పోర్టు సైజు ఫొటోలతో హాస్టల్‌లో సంప్రదించాలని కోరారు.

కంపచెట్లు తొలగింపు

పోరుమామిళ్ల, ఆగస్టు 23 : పోరుమామిళ్ల నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి మల్లకతవ సమీపంలో రోడకిరువైపులా ఉన్న కంపచెట్లను సీఐ శ్రీనివాసులు చొరవతో ఆర్అండ్‌బీ అధికారులు తొలగించారు. మల్లకతవ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎగువ రామాపురానికి చెందిన సాయి, తరుణ్ అనే వారు మృతి చెందిన విషయం విధితమే. ఆ ప్రాంతంలో కంపచెట్లు ఉండడంతో ప్రమాదాలకు నిలయంగా మారిందని అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు శుక్రవారం వాటిని తొలగించారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు



ప్రొద్దుటూరు గ్రామసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



మైలవరంలో మాట్లాడుతున్న భూపేశ్‌రెడ్డి



బీకోడూరు... ఐత్రంపేట గ్రామసభలో మాట్లాడుతున్న రితీశ్‌కుమార్‌రెడ్డి

ప్రొద్దుటూరు ఆగస్టు 23 :గ్రామాల్లో మౌలిక సౌకర్యాల కల్పన మెరుగు పరుస్తామని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక సోముల వారిపల్లె ఈశ్వరరెడ్డినగర్ లో గ్రామ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ జుబేదా బేగం పంచాయితీ కార్యదర్శులు పాల్గొన్నారు,

కాశినాయన..: అధికారులు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి గ్రామపంచాయతీలను ప్రగతిపథంలో నడిపించాలని ఎంపీడీవో మైథిలీ పేర్కొన్నారు.శుక్రవారం నర్సాపురం,అముగంపల్లె, వడ్డమాను, రంపాడు, ఉప్పలూరు, బాలాయపల్లె, వరికుంట్ల,చెన్నవరం, రెడ్డికొట్టాల, ఆకులనారాయణపల్లె,సావిశెట్టిపల్లె, కోడి గుడ్లపాడు,మిద్దెల, గొంటువారిపల్లె,కొండ్రాజుపల్లె,ఇటుకులపాడు,గంగనపల్లె పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించారు.ఈసమావేశాల్లో 2024- 2025 ఆర్థిక సంవత్సరంలో ఆయాపంచాయతీల్లో ఉపాధిపథకం కింద చేపట్టబోయే పనులను గుర్తించి సభదృష్టికి తెచ్చారు. ఈగ్రామసభల్లో పర్యవేక్షణాధికారులు ఎంఈవో నిర్మల, ఈవోపీఆర్డీ ముజఫర్ రహీం, ఏఈలు బాలిరెడ్డి, సందీప్,బాలపుల్లయ్య,ఏపీయం వీరాంజనేయులు,ఏవో వెంకటప్రవీణ్, నేతలు బంగారు గుర్విరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్‌లు ఖాజావలి, ఎం.జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

అట్లూరు..:గ్రామ పంచాయతీల అభివృద్ధి ధ్యేయమని బద్వేలు డీపీఎల్‌వో రమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కొండూరు గ్రామసభలో ఆయన పాల్గొన్నారు.అభివృద్ధి పనుల గురించి గ్రామసభలో చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పి.మల్లికార్జునరెడ్డి, మంచూరి సూర్యనారాయణరెడ్డి, సుధారాణి, మాజీ మండల పంచాయతీ అధికారి శివప్రసాద్, అధ్యక్షుడు అమర్‌నాథరెడ్డి, అరవ శ్రీనివాసులరెడ్డి, గ్రామప్రజలు పాల్గొన్నారు.

బి.కోడూరు..: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే గ్రామపంచాయతీలోని అధికారులు, మండల అధికారులు సమన్వయంతో పనిచేయాలని బద్వేలు యువ నాయకుడు రితీష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పది గ్రామ పంచాయతీల్లో ఎంపీడీవో భాస్కర్‌రావు అధ్యక్షతన నిర్వహించారు. ఐత్రంపేట, తంగేడుపల్లె గ్రామ పంచాయతీల్లో ముఖ్యఅతిథిగా పాల్గొని రితీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడారు. అనంతరం సచివాలయం ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీవో రాజుసాహెబ్, అన్నిశాఖల అధికారులు, మండల టీడీపీ అధ్యక్షుడు రామచంద్రారెడ్డి, గోడి రమణారెడ్డి, ఓ.రమణారెడ్డి, జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు రామసుబ్బారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, దుగ్గిరెడ్డి, పవన్, రాఘవరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, నవీన్, బాలిరెడ్డి, క్రిష్ణయ్య, రవిక్రిష్ణారెడ్డి, చెన్నారెడ్డి, బాలయ్య, శేషారెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దముడియం..: గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. పెద్దముడియం మండలంలోని 22 గ్రామ పంచాయతీల పరిధిలో శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని సచివాలయాలు గ్రామ కూడళ్లల్లో గ్రామసభలు నిర్వహించారు. సుద్దపల్లెలో జరిగిన గ్రామసభకు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి గ్రామసభకు హాజరయ్యారు. ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఇతర అధికారులు ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ముద్దనూరు..: మండలంలోని 19 గ్రామ పంచాయతీలో దాదాపుగా సీసీ రోడ్లు ఏర్పాటుకు తీర్మాణించినట్లు ఎంపీడీవో చంద్రమౌళీశ్వర్ పేర్కొన్నారు. అన్ని గ్రామ పంచాయతీల్లో శుక్రవారం ఉపాధి హామీలో పనుల గుర్తింపునకు గ్రామ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్డీ వీరభద్రుడు,ఎంపీటీసీ లక్ష్మీకాంతమ్మ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మైలవరం..: గ్రామల్లో ప్రజా సమస్యల పరిష్కారానికే రాష్ట్ర ప్రభుత్వం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దొమ్మరనంద్యాల గ్రామ పంచాయతీలో ఆయన పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దారు లక్ష్మీనారాయణ,ఎంపీడీవో శంషాద్‌బాను. ఈవోపీఆర్డీ రామచంద్రారెడ్డి, మండల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు..: ప్రజా సమస్యల పరిష్కారమే గ్రామ సభల ధ్యేయమని సర్పంచ్‌లు, అధికారులు తెలిపారు. జమ్మలమడుగు మండలంలో పలుచోట్ల గ్రామ సభలు జరిగాయి. అందులో గొరిగెనూరు గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో సర్పంచు మత్తయ్య, ఇతర అధికారులు మాట్లాడారు. గ్రామసభల్లో పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో మోరగుడిలో ఎంపీపీ హరిత, గురుశేఖర్‌రెడ్డి, రమాదేవి, చౌడం జొల్లు కొండయ్య, గురు ఈశ్వర్, తదితర సర్పంచులు, అధికారులు ఎంపీటీసీలు, ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది, డాక్టర్లు పాల్గొన్నారు.

కొండాపురం..: మండల వ్యాప్తంగా 28 పంచాయతీల్లో శుక్రవారం నిర్వహించిన ఉపాధిహామీ గ్రామసభల్లో సమస్యలను పరిష్కరించాలని ప్రజలు, నాయకులు వినతులు ఇచ్చారు. సమస్యలపై పలు అర్జీలు వచ్చినట్లు ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు.ఆయా పంచాయతీల్లో జరిగిన గ్రామసభల్లో అధికారులు, ప్రజలు, ఎన్డీయే కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని శుక్రవారం నిర్వహించిన గ్రామసభల్లో ప్రజాప్రతినిధులు అధికారులను కోరారు. పోట్లదుర్తి సచివాలయంలో నిర్వహించిన గ్రామ సభలో ఎంపీటీసీ శివప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ నరసింహులు, ఉపసర్పంచ్ రామునాయుడు తదితరులు మాట్లాడుతూ గ్రామ పొలాల్లో ఉన్న మైలవరం కెనాల్‌ను ఉపాధిహామీ కింద పనులు పెట్టి బాగుచేయించాలన్నారు. పలు సమస్యలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ రంతుల్లయ్య, కార్యదర్శి సాంబశివారెడ్డి, సర్పంచ్ చిత్రాల హెబ్సిబా, ఉపమండలాధ్యక్షుడు శ్రీను, సున్నపురాళ్లపల్లె సర్పంచ్ తొడిమె వరలక్ష్మి, ఫీల్డ్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

చాపాడు..: మండలంలోని మొత్తం 22 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఈ గ్రామసభల్లో మొత్తం 145 అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించినట్లు తెలిపారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు మంజూరు కాగానే ఈ అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ గ్రామసభల్లో ఎంఈవోలు రవిశంకర్, వంశీకృష్ణ, ఈవోపీఆర్‌డీ క్రిష్ణవేణి, పశువైద్య డాక్టర్లు మహమ్మద్‌గౌస్, సుదర్శన్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

బద్వేలు రూరల్..: మండల పరిధిలోని తిరువెంగలాపురం గ్రామసచివాలయంలో శుక్రవారం ప్రత్యేక అధికారి సూర్యనారాయరెడ్డి ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామాల్లో సిమెంటురోడ్లు, మురుగుకాల్వలు, హార్టికల్చర్ తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు బిజివేముల చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల..: గ్రామ పంచాయతీలో ప్రజల సమస్యలు పరిష్కరించడం కోసమే ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పోరుమామిళ్ల మేజరు పంచాయతీ సర్పంచ్ యనమల సుధాకర్ అన్నారు. శుక్రవారం పోరుమామిళ్ల పంచాయతీ కార్యాలయ ఆవరణంలో గ్రామసభలు నిర్వహించారు. ఈ గ్రామసభలో స్పెసల్ ఆఫీసరు చంద్రశేఖర్, ఎంపీడీవో వరప్రసాదరావు, పంచాయతీరాజ్ కార్యనిర్వాహణాధికారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షుడు సీఎంబాషా, ఉప సర్పంచ్ రాళ్లపల్లి రవికుమార్, జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, పంచాయతీ సిబ్బంది , టీడీపీ నాయకులు ఎస్ఎంబాషా పాల్గొన్నారు. అలాగే పలు చోట్ల గ్రామసభలు నిర్వహించి సమస్యలపై చర్చించారు.

ఖాజీపేట..: రాష్ట్రాన్ని టీడీపీ అభివృద్ధిపథంలో నడిపిస్తోందని టీడీపీ మండల అధ్యక్షుడు లక్ష్మీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అన్ని పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించారు. ప్రతి పంచాయతీలో ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి వారి సమస్యలు విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటరమణ, ఈవోపీఆర్‌డీ వెంకటసుబ్బారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, సర్పంచులు, సెక్రటరీలు, వీఆర్వోలు, అంగన్వాడీ వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టౌన్..: రాష్ట్రంలోని గ్రామాలను స్వర్ణగ్రామాలుగా తీర్చిదిద్దడమే ఎన్డీయే కూటమి ప్రభుత్వ లక్ష్యమని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళి పేర్కొన్నారు. శుక్రవారం చెన్నంరాజుపల్లె పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. అనంతరం గ్రామ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కుళాయమ్మ, సర్పంచ్ ఆర్.ఆదిలక్ష్మి, గ్రామ పెద్దలు వెంకటసుబ్బయ్య, బలరాముడు, గంగయ్య, మేకల వెంకటసుబ్బయ్య, బాలగురవయ్య, తదితరులు పాల్గొన్నారు.

రాజుపాలెం..:మండలంలోని అన్ని గ్రామాల్లో ఎంపీడీవో షాకీర్ ఆలీఖాన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామసభలు నిర్వహించారు. ఉపాధి హామీ పథకంకింద పనులు గుర్తించేందుకు గ్రామసభల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వార్డుమెంబర్లు, వారి పర్యవేక్షణలో గ్రామసభలు జరిగాయి. కార్యక్రమంలో ఏవో శివరామక్రిష్ణారెడ్డి, ఉపాధి హామీ పథకం ఏపీవో లక్ష్మీనారాయణ, కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గోపవరం..: పేదరిక నిర్మూలనే ఉపాధి హామీలక్ష్యమని అడిషనల్ పీడీ నాగరత్నమ్మ అన్నారు. మండలంలోని కాల్వపల్లె పంచాయతీ ఆవరణలో సర్పంచ్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామక్రిష్ణయ్య ,ఈవోపీఆర్‌డి షేక్ హసీనా, కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, ఏపీవో విజయమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గోపవరం సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ విజయ్, ఎంపీడీవో, సర్పంచ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

బ్రహ్మంగారిమఠం..: ఉపాధి హామీ పథకం ద్వారా అమలయ్యే పథకాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వెంగమునిరెడ్డి తెలిపారు. శుక్రవారం స్థానిక స్త్రీశక్తిభవన ప్రాంగణంలో సోమిరెడ్డిపల్లె గ్రామ పంచాయతీ గ్రామసభను నిర్వహించారు. ఆయా పంచాయతీల్లో ఉన్న సమస్యలను చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, ఎస్ఆర్ శ్రీనివాసుల రెడ్డి, సాంబశివారెడ్డి, పంచాయతీ సెక్రటరీ ప్రభాకర్‌రావు, వెలుగు ఏపీయం ప్రకాశరావు, కమ్యూనిటీ కోఆర్డినేటర్లు భాస్కర్, బాలయ్య, నారాయణ, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. అలాగే మల్లేపల్లె గ్రామ పంచాయతీల్లో సర్పంచ్ లక్ష్మీదేవి , ముడుమాలలో సర్పంచ్ వేమిరెడ్డి మునిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ రమేశ్, మాజీ డైరెక్టరు చిలమల నారాయణ, నాగయ్య, మేకల సుధాకర్, సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు టంగుటూరి ప్రకాశం



బీకోడూరులో విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అధికారులు

బద్వేలు, ఆగస్టు 23: టంగుటూరి ప్రకాశం పంతులు చిరస్మరణీయుడని బిజివేముల వీరారెడ్డి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకట సుబ్బారెడ్డి పేర్కొన్నారు. కాగా ఆ కళాశాలలో జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో శుక్రవారం టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల జాతీయ సేవా పథకం సమన్వయకర్తలు డాక్టర్ దొరస్వామి నాయక్, ఈశ్వరయ్య, మహేష్, హరిహరనాథరెడ్డి, జి.వి.రాఘవరెడ్డి, జి.శ్రీనివాసులు, బాలయ్య, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బి.కోడూరు..: మండల పరిధిలోని కస్తూర్బాగాంధి పాఠశాల లో శుక్రవారం టంగుటూరి ప్రకాశం జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఎంపీడీవోభాస్కర్‌రావు, ఐసీడీఎస్ సీడీపీవో శ్రీదేవి, సూపర్‌వైజరు సుగుణ, కస్తూర్బాగాంధీ పాఠశాల హెచ్ఎం శ్రీలతారెడ్డి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థినులకు ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై దాడులు

రాజుపాలెం, ఆగస్టు 23 : అక్రమ మద్యంపై రాజుపాలెం ఎస్ఐ కత్తి వెంకటరమణ ఆధ్వర్యంలో దాడులు చేశారు. శుక్రవారం జరిపిన దాడుల్లో పర్లపాడుకు చెందిన మర్రి భూషణం, కమాలుద్దీన్ అక్రమంగా మద్యం విక్రయిస్తుండడంతో వారి వద్ద నుంచి 85 మద్యంబాటిళ్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కత్తి వెంకటరమణ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు



త్రిపుర సుందరీదేవి అమ్మవారు

జమ్మలమడుగు, ఆగస్టు 23: జమ్మలమడుగు మండలంలోని ప్రముఖ శైవక్షేత్రమైన కన్యతీర్థంలో శ్రావణశోభ సంతరించుకుంది. శుక్రవారం ఉదయాన్నే బాలత్రిపుర సుందరీదేవి అమ్మవారికి శ్రావణ శోభ విశేష పూజలు చేశారు. ఆలయ పురోహితులు హరిహరనాథశర్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి శ్రీచక్ర పూజ, అభిషేకం, సహస్రనామార్చనలు, కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు ప్రత్యేక పూజలు చేసి మొక్కుకున్నారు.

కూలర్లు వితరణ



కొండాపురం, ఆగస్టు 23: మండలంలోని టీ.కోడూరు ఎంపీటీసీ రామ మునిరెడ్డి గ్రామసచివాలయానికి రెండు పెద్ద ఎయిర్ కూలర్లను శుక్రవారం వితరణగా ఇచ్చారు. ఎయిర్ కూలర్లను గ్రామంలో జరిగే ఫంక్షన్లకు స్థానికులు ఎవరైనా ఉపయోగించుకోవచ్చని ఆయన తెలిపారు. కోడూరు సచివాలయంలో వీటిని అందుబాటులో ఉంచినట్లు ఆయన పేర్కొన్నారు.

ఉర్దూ జూనియర్ కళాశాల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 23: పట్టణంలో 2008లో ఏర్పాటు చేసిన ఉర్దూ జూనియర్ కళాశాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని శుక్రవారం కార్మిక నేస్తం జిల్లా అధ్యక్షుడు చింతకుంట కుతుబుద్దీన్ ఆధ్వర్యంలో మైనార్టీ నేతలు కలెక్టర్ శివశంకర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో తరగతి గదుల కొరత ఉందని, బాలికలకు సరైన బాత్‌రూములు లేక ఇబ్బందులు పడుతున్నారని తదితర సమస్యలు ఉన్నాయని చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వడ్ల ఇబ్రహీం, ఆర్టీసీ బాబా, నూరి, హర్షాద్, పిట్టర్ రఫి, పాలగిరి బాబా, మస్తాన్, ఖాజా మైనుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లోనే ఇసుకను బుక్ చేసుకోవాలి



పి.అనంతపురం ఇసుకరీచ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో

కొండాపురం, ఆగస్టు 23: ఇసుక కావలసిన వారు వారి సచివాలయ పరిధిలోనే ఇసుకను బుక్ చేసుకోవాలని ఎంపీడీవో నాగప్రసాద్ తెలిపారు. శుక్రవారం మండలంలోని పి.అనంతపురం ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుకరీచ్‌ల వద్దకు వెళ్లకుండా సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ దగ్గరకు వెళితే ఇసుకను బుక్ చేయడంతో పాటు ట్రాన్స్‌పోర్టు వివరాలను కూడా ఇస్తారన్నారు. వారికి అక్కడ టైమ్‌స్లాట్ కూడా ఇస్తారన్నారు. దీనివల్ల సమయం వృథా కాకుండా క్యూలో నిల్చుకొనే బాధలు ఉండవని ఎంపీడీవో తెలిపారు.

వాటర్‌ప్లాంట్‌కు మోక్షం ఎన్నడో..?



మున్సిపల్ వాటర్‌ప్లాంట్

జమ్మలమడుగు, ఆగస్టు 23: జమ్మలమడుగులోని మున్సిపాలిటీకి సంబంధించిన వాటర్‌ప్లాంట్లు రెండు నెలల క్రితం సంబంధిత అధికారులు సీజ్ చేశారు. అప్పటి నుంచి సుమారు నెల రోజులు గడిచిన తర్వాత అధికార పార్టీకి చెందిన కార్యకర్తలకు కొన్ని అప్పగించారు. అయితే నీటి సమస్యలు ఇటీవల తలెత్తాయి. ప్రజలు వాటర్‌ప్లాంట్ల వద్దకు వెళ్లి తక్కువ ధరకు వాటర్ కొనుగోలు చేసి పట్టుకునేవారు. గత రెండు నెలల నుంచి నారాపురం వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదురుగా ఉన్న మున్సిపాలిటీకి సంబంధించిన వాటర్‌ప్లాంట్‌కు తీవ్ర పోటీనెలకొంది. ఒకే వర్గంలో పలువురు పోటీ పడుతుండడంతో ఎవరికీ అప్పగించలేదు. అయితే సంబంధిత వ్యక్తులు ప్రతిరోజు రావడం, వాటర్‌ప్లాంట్‌వద్దకు చూసి వెళుతున్నారు. కానీ నీళ్లకోసం ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా ప్రధాన నీటి సమస్య వాటర్‌ప్లాంట్ అప్పగింత కార్యక్రమం వెంటనే అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

రాజరాజేశ్వరిదేవికి ప్రత్యేక పూజలు

ప్రొద్దుటూరు టౌన్, ఆగస్టు 23: అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. శుక్రవారం తెల్లవారుజామున రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారి మూలవిరాట్‌ను రంగు రంగుల పూలు, వట్టివేరు దండలతో అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించి కాయాకర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొత్తమిద్దె రఘురామిరెడ్డి, పాలక మండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయాలి

సీడీపీవో రాజేశ్వరి

ఖాజీపేట, ఆగస్టు 23: విద్యార్థుల నైపుణ్యాన్ని వెలికితీయాలని సీడీపీవో రాజేశ్వరి అన్నారు. ఖాజీపేటలోని కస్తూర్బాగాంధీ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆగస్టు 15 సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా గెలుపొందినవారికి శుక్రవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎం.ప్రశాంతి, రెండో బహుమతి సుమహరిత, మూడో బహుమతి కీర్తన అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు భార్గవి, సూపర్‌వైజర్లు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ అంతరిక్ష దినోత్సవం

మైదుకూరు రూరల్, ఆగస్టు 23 : జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శుక్రవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్స్‌పాల్ నారాయణరెడ్డి అధ్యక్షతన విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు. సమావేశంలో నారాయణరెడ్డి మాట్లాడుతూ 2023,ఆగస్టు 23, తేదీన చంద్రయాన్ చంద్రమండలంలో చేరిన సందర్భంగా అన్ని కళాశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రాధరామ్,నవనీతేశ్వర్‌రెడ్డి,కృష్ణారెడ్డి పాల్గొన్నారు.